UNIVERSAL LIBRARY
OU_206010
UNIVERSAL LIBRARY

OUP—391—29-4-72—10,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T81 T83T Accession No. PG 7193

Author త్రిపురాంతకకవి, రావిపాటి.

Title త్రిపురాంతకోదాహరణము

This book should be returned on or before the date last marked below.
1946.

శ్రీ

# త్రిపురాంతకోదాహరణము.

రావిపాటి త్రిపురాంతక మహాకవి ప్రణీతము.

నిడుదవోలు వేంకటరావు, ఎమ్. ఏ,

సంస్కర్త.

Text Book for Preliminary Examination
Bhasha Praveena (Telugu) of the
Andhra University 1941.

Text Book for Vidwan B. Final Examination
of the Madras University from 1944 to 1950.

## మనవి

1937 లో నేను ప్రకటించిన యీ లఘుకృతిని తమ విశ్వవిద్యాలయమున విద్వాన్ పరీక్షకు పఠనీయగ్రంథముగఁ జేయుటయేగాక, దీనిని ముద్రించుటకు దయతో ననుజ్ఞయిచ్చిన మదరాసు విశ్వవిద్యాలయాధికారుల కెంతయు గృతజ్ఞుఁడను.

1/A ఆలంగతపిళ్లవీథి
తిరువల్లికేణి, చెన్నపురి
26-11-1946

నిడుదవోలు వేంకటరావు
ఆంధ్రభాషోపన్యాసకుఁడు
మదరాసు విశ్వవిద్యాలయము.

# పీఠిక.

భక్తిరసప్రధానమై, యాంధ్రశైవవాఙ్మయమునకు సంబంధించిన లఘుకృతులయం దెన్నికఁగన్న యీయుదాహరణము నేఁటి కించుమించుగ నాలుగూ రేండ్లక్రిందట సిరిగిరికిఁ దూర్పువాకిలియగు త్రిపురాంతకమున నెలకొనిన దేవరపేర వెలసినది. సంబుద్ధికో నెనిమిదియగు విభక్తులతో నెనిమిదిపద్యములును, కళికలును, నుత్కళికలును గలిగి భక్తిప్రశంసాపరమగు ప్రబంధభేదమునకు నుదాహరణ మనిపేరు. ఆంధ్రవాఙ్మయమున నుపలబ్ధము లగునట్టి యుదాహరణములలోఁ బండ్రెండవశతాబ్దమునఁ బుట్టిన పాల్కురికి సోమనాథుని బసవోదాహరణము ప్రథమము. త్రిపురాంతకోదాహరణము కాలక్రమమున ద్వితీయమైనను, కవితాప్రకర్షయం దద్వితీయమగుటచే నీవఱకు రెండుతడవలు ముద్రింపఁబడినను మూఁడవతూరి ముద్రణావశ్యకతఁ జేకూర్చినది.

## 1. పూర్వమాతృకాగ్రంథవివరణము.

ఈయుదాహరణమునకు మాతృక తంజావూరున శ్రీ శరభోజిమహారాజ సరస్వతీభవనప్రాచ్యలిఖితగ్రంథభాండారమునందు గలదు. నే నీమాతృకకు సరియగుప్రతికను[1] వ్రాయించి

1. దీనిని యథామాతృకముగ వ్రాయించు సకాలమునకు నా కందఁజేసిన తంజావూరు సరస్వతీగ్రంథాలయకార్యనిర్వాహకసంఘ గౌరవ కార్యదర్శులు శ్రీమంత రావుసాహెబు టి. సాంబమూర్తిరావు, బి.ఏ. ఎమ్.ఎల్. గారికి నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

తెప్పించికొని యీముద్రణమున నుపయోగించితిని. దీనిని తొలుత క్రీ. శ. 1912వ సంవత్సరమున సుప్రసిద్ధప్రాచ్యవిద్యాపరిశోధకులు మా రామకృష్ణకవిగారు విస్మృతకవులనుపేరం దాము ప్రకటించినగ్రంథావళియం దాఱవదిగ, వెలువరించినారు. అది వనపర్తియందలి బ్రహ్మవిద్యావిలాసముద్రాక్షరశాలలో ముద్రింపంబడి పీఠిక, లఘుటీకలతో నొప్పుచున్నది.

శ్రీరామకృష్ణకవిగారె దీనిని రెండవతూరి శ్రీతిరుమల వేంకటేశ్వరపత్రికయందు, క్రీ. శ. 1933 సంవత్సరమున నేప్రియలు నెలలోఁ బ్రకటించిరి.

పైని వివరించినవిగాక, యీగ్రంథప్రశస్తినిఁ దెలుపుచు నమూల్యమగు తమస్వంతపుఁబ్రతిని నాకు బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రులవారు పంపిరి. వారికి నే నెంతయుఁ గృతజ్ఞుఁడను.

## 2. గ్రంథకర్తృత్వము.

ఈయుదాహరణమునకుఁ గర్త రావిపాటి త్రిపురాంతకుఁడు. ఈవిషయము గ్రంథమునం దెచ్చటను లేకపోయినను [1]నంధ్రవాఙ్మయమున సంకలితలక్షణగ్రంథములలోని యుదా

1 ఆంధ్రమున ప్రబంధరత్నాకరము, సంస్కృతభాషలో కవీంద్రవచనసముచ్చయము, శార్ఙ్గధరునిపద్ధతి, జల్హణునిసూక్తిముక్తావళి, వల్లభదేవుని సుభాషితావళి మొదలగువానిఁబోలిన సంకలితగ్రంథము. తెనుఁగులో మడికి సింగనసమకూర్చిన సకలనీతిసమ్మతము మొదటిది. ఇది రెండవది. ఇది యముద్రితము. మూఁడాశ్వాసములదనుక తంజావూరుపుస్తకాగారమునఁ గలదు. ఇది దపూర్వగ్రంథము లుద్ధరింపఁబడినవి.

హ్యాతులవలన నిది త్రిపురాంతకుని కృతిగాఁ దెలియుచున్నది. క్రీ. శ. 16 వ శతాబ్దాదిని ప్రాచీనగ్రంథసంకలనము గావించిన పెదపాటి జగన్నాథకవి తనప్రబంధరత్నాకరమున [1] దీనిని త్రిపురాంతకునిదనిఁ జెప్పియున్నాఁడు. ఆపైని యప్పకవి వేంకట కవిముస్సలాతుకులు తమగ్రంథముల దీనినిఁ త్రిపురాంతకు నిదిగా నుదాహరించియున్నారు. కావున దీనికిఁ గర్త త్రిపురాం తకుఁడనియే నిర్ధారింపఁదగియున్నది. ఇది యిట్లుండ క్రీ. శ. 1933 సంవత్సరమునఁ బ్రకటింపఁబడిన తంజాపురాంధ్రగ్రంథవివరణ సూచిక [2] యందు నీగ్రంథమునుఁగూర్చియు గ్రంథకర్తనుఁ గూర్చియు నిట్లు వ్రాయఁబడినది.

166. త్రిపురాంతకోదాహరణము.

R సమగ్రము. వ్రాలు చక్కనివి. తప్పులు లేవు. శైథిల్యము లేదు. గ్రంథపాతముం గన్పట్టదు. "తలఁకి సీనము రాజు దాడికోర్చినవాని" "వరలువరమానందవనధితీర్థమువలన" అని యీగ్రంథమున నిద్దఱిపేరులు గన్పట్టుచున్నవి. వీరిలో గ్రంథకర్త యీతఁడని నిశ్చయింప వీలుగాకున్నది.

తరువాత నాంగ్లేయభాషలో నిట్లున్నది.

" There is a printed work of the same name attributed to Thripurantaka wheather this manuscript represents the printed work needs examination "

---

2. ఆంధ్రవిశ్వకళాపరిషత్ప్రకటితము 1933. పుట. 37.

(చూ. పుట. 37. A Descriptive Catalogue of the Telugu Manuscripts in the Tanjare Maharaja Serfojis Saraswati Mahal Library.)

(ఈ పేరితో త్రిపురాంతకుని కారోపింపఁబడిన ముద్రిత గ్రంథ మొకటి గలదు. ఈతాటాకుప్రతి యాముద్రితపుస్తకము నకు మూలమేమో పరిశీలింపఁదగియున్నది).

కాని గ్రంథప్రకాశకులు పైని వ్రాసినట్లు సీనమరాజు గాని, పరమానందతీర్థుఁడుగాని త్రిపురాంతకోదాహరణగ్రంథ కర్త కాజాలఁడు. సీనమరాజు ప్రాచీన ద్రావిడ శైవభక్తుఁడు. చేరమరాజని యీతని నామాంతరము. ఈతఁ డెనిమిదవశతా బ్దికిఁ బూర్వుఁడు ఈతఁడు గ్రంథకర్తయగుట యసంభవము గదా! ఇఁక "పరమానందతీర్థమువలన" అనునది కేవల గ్రంథస్థ విషయము. ఇది పంచమీవిభక్తికళికయందు ద్వితీయపాదమున 'మఱియు సకలాశ్రితుల మనుచు నర్థమువలన' యనుదానితో సార్థకతఁ జెందినది. ఇచట కేవలానందజలధితీర్థమనియే కవి భావము. అయినను గ్రంథకర్త పరమానందతీర్థు లనుకొనుటకుఁ గారణము లేకపోలేదు. వివరణగ్రంథమున, పరమానందతీర్థ కవికృతగ్రంథములు పెక్కులుండుటచేత నామసాదృశ్యముచేత పరమానందతీర్థులని భ్రాంతిపొడమి యట్లు వ్రాసిరి గాని వేఱు గాదు పరమానందతీర్థుఁడను వేదాంతకవి, అనుభవదర్పణము, శివజ్ఞానమంజరి, బ్రహ్మవిద్యాసుధార్ణవము, భగవద్గీతావ్యా ఖ్యానము, ముక్తికాంతావిలాసము, దత్తాత్రేయ, శివముకుంద సంపంగి మన్నశతకత్రయము మున్నగు బహుళగ్రంథములు రచియించినాఁడు. ఈతఁడు పదునాఱవశతాబ్దము నాఁటివాఁడు. ఈతనిచరిత్రము శతకకవులచరిత్రయందు వర్ణితము. పుటలు (167-171) ఈతఁడును త్రిపురాంతకోదాహరణకర్త కాఁజాలఁ డనుటకుఁ బై వివరణము చాలును.

ఇట్లే శ్రీ గిడుగువారు తాము ప్రకటించిన [1]యప్పకవీయమున త్రిపురాంతకోదాహరణముఁ గూర్చి యిట్లు వ్రాసియున్నారు. "త్రిపురాంతకోదాహరణము." ఇది యెనిమిదితాటాకులపుస్తకము. గ్రంథకర్త గుండయకవి.

ఇందు గ్రంథకర్త గుండయకవియనుట పొరపాటే! గుండయ ప్రాచీనశైవభక్తుఁడు. గుండయపేరు చతుర్థీవిభక్తి యుత్కళికయందుదాహరింపఁబడినది. ఈతనిచరిత్ర బసవపురాణమున వర్ణితము. ఈ గ్రంథము శైవసంప్రదాయిక మగుటచేతను, సందర్భానుసారముగ నాయాభక్తులచరిత్రము లుద్ధరింపఁబడుటచేతను, వారిచరిత్రము లాంధ్రసాహితీవేత్తలకు సుపరిచితములు గాకపోవుటచేతను గ్రంథకర్తనుఁగూర్చి యిట్టి వేరుపాటు గలిగినది. త్రిపురాంతకుఁడే గ్రంథకర్తయనుట నిర్వివాదాంశము.

## 3. కవిజీవితము.

రావిపాటి త్రిపురాంతకుని వాడుకపేరు తిప్పన. [2]తెలుఁగు కవులలో నీతనిచరిత్రము బహుసులభముగా వ్రాయవచ్చును. ఏలయన నితనిపేరు తప్ప, తలిదండ్రులపేళ్లుగాని కులగోత్రవిద్యావిషయము లితరము లేవియుఁ దెలియరావు. త్రిపు

1. అప్పకవీయము వావిళ్ల వారిముద్రణము 1924 అప్పకవి ఉదహరించిన గ్రంథములు. అందులోనిపద్యములు 3 పుట యడుగున యథోజ్ఞాపిక.

2. భాస్కరశబ్దమునకు బాచన్న, తిరుమలశబ్దమునకుఁ దిమ్మన, త్రిపురాంతకునికిఁ దిప్పన్న, జగన్నాథశబ్దమునకు జగ్గన్న ఆదిత్యునకు నైతన భైరవునకు బయ్యన్న వికృతరూపములు.

రాంతకునితరకృతులు సంపూర్ణముగ దొరకినచోఁ గొంత తెలియును గాని వానియందు కొన్నిపద్యములే లభించుచున్నవి గావున నీతనిచరిత్రము నిగూఢమైయున్నది.

జన్మముచే నెవ్వఁడైనను భక్తిప్రపత్తియం దీతఁడు శైవుఁడని చెప్పనొప్పును. ఈయుదాహరణమునందలి శైవసంప్రదాయాభిజ్ఞతయందేమి, ప్రాచీనశివభక్తకథాసూచనమునందేమి కవి శైవుఁడగుట స్పష్టమే! పేరు శైవులదే! ఈతఁడు శ్రీశైలమునకుఁ దూర్పువాకిలియగు త్రిపురాంతకక్షేత్రమున జనించి తద్దేవునకు భక్తుఁడై శృంగారకావ్యములను భక్తిరసప్రధానములగు కావ్యములు రచియించె నని రెండవప్రతాపరుద్రునికాలమువాఁ డని శ్రీరామకృష్ణకవిగారు త్రిపురాంతకోదాహరణము తొలికూర్పునను మలికూర్పునుగూడ వ్రాసియున్నారు. దీని కాధార మూహ్యము.

## 4. కాలనిర్ణయము.

శ్రీరామకృష్ణకవిగారు, త్రిపురాంతకుఁడు ద్వితీయప్రతాపరుద్రునికాలమువాఁడని వ్రాసినారు. త్రిపురాంతకుఁ డనుకవి ద్వితీయప్రతాపరుద్రునియాస్థానమున నున్నట్లు ప్రతాపచరిత్రమునఁ[1] గలదు. కాకతీయచక్రవర్తులలోఁ గడపటివాఁ డగు నీప్రతాపరుద్రుఁడు క్రీ. శ. 1295 మొదలు 1326 వఱకుఁ బరిపాలించినవాఁడు. కావున నీతఁ డాకాలమువాఁడు కావలెను. కాని దీని కొకప్రతిబంధకము గలదు. రావిపాటితిప్పన్నచాటుధార యని యప్పకవీయమున యతిప్రాసవిషయికమగు మూ

1. ప్రతాపచరిత్రము-ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక. 7. సంపుటము. 7. పుట.

డవునాశ్వాసమున ననుస్వారసంబంధయతి కుదాహరణముగా నీ క్రిందిపద్యము దాహరింపఁబడియున్నది.

మ. సరిశేసై రిపుఁడేల భాస్కరులు భాషానాథ! పుత్రా! వసుం
ధరయం దొక్కఁడు మంత్రియయ్యె వినుకొండన్; రామ
యామాత్యభా
స్కరుఁడో? ఔ, నయిన న్సహస్రకరశాఖల్లే వవేయున్న వే
తిగ మైదానము సేయుచో, రిపుల హేతిన్ వ్రేయుచో, వ్రాయు
చోన్.

పై పద్యమునందలిపాఠము ముప్పదియిద్దఱుమంత్రులచరిత్రమున రాయనామాత్యభాస్కరుఁడని యున్నది. ఇదియ సరియగుపాఠము. ఈభాస్కరులు పెక్కురు గలరు. వారిలో నీరాయనిభాస్కరుఁడు దాతృత్వమున తెలుఁగునాఁటఁ బేరెన్నికఁ గన్నవాఁడు ఈతనిఁగూర్చి భట్రాజులు చెప్పినపద్యములు చాల గలవు. గ్రంథవిస్తరభీతి నుదాహరింప మానితిని. ఈతఁడు క్రీ. శ. 1386 సంవత్సర ప్రాంతమున రాజమహేంద్రవరమును పరిపాలించిన రెడ్డిరాజు కాటయవేముని యాస్థానమున నున్నట్లీ క్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

చ కలయఁ బసిండిగంటమునఁ గాటయవేము సమక్షమందు స
త్ఫలముగ రాయనిప్రభునిఁ బోచఁడు వ్రాసిన వ్రాలమ్రోఁతలున్
గలుగలు గల్లుగల్లురనఁ గంటకమంత్రుల గుండెలన్నియున్
జలుజలు జల్లుజల్లురనె సత్కవివర్యులు మేలుమేలనన్.

రాయనిభాస్కరుని స్తుతియించిన త్రిపురాంతకుఁడు క్రీ. శ. 1330 ప్రాంతమువాఁడు గావలెను.

ఇందులకు ప్రబలముగ శ్రీనాథమహాకవిరచితమై వల్లభ రాయని కృతిగా పేర్వెలసిన క్రీడాభిరామమున త్రిపురాంతకుని ప్రశంసగలదు.

ఉ. నన్నయభట్టు, తిక్కకవినాయకుఁ డన్న, హుళిక్కి భాస్కరుం
డన్నను, జిమ్మపూడి యమరాధిపుఁ డన్నను సత్కవీశ్వరుల్
నెన్నుదుటం గరాంజలులు నింతురు 'జే' యని రావిపాటి తి
ప్పన్నయు నంతవాఁడ! తగునాయిటు దోసపు మాటలాడగన్.

మఱియు నీత్రిపురాంతకుఁడు సంస్కృతమున రచించిన ప్రేమాభిరామము ననుసరించి తెనుఁగున క్రీడాభిరామము రచియించిన ట్లా గ్రంథమునఁ గలదు.

"తిప్పమంత్రీంద్రతనయుఁ డార్య మణివల్లభామాత్యుఁ డహరహంబు."

వ. ఆమంత్రిశేఖరుండు రావిపాటి త్రిపురాంతక దేవుఁడను కవీశ్వరుఁ డొనరించిన ప్రేమాభిరామనాటకము ననుసరించి క్రీడాభిరామంబను రూపకంబు తెలుఁగు బాసను రచియించినాఁడు."

వల్లభరాయుని తండ్రి తిప్పన కర్ణాటరాజ్యమును పరిపాలించిన మొదటి హరిహరరాయని రత్నభాండాగారాధికారి యగుటచేతను, నాతని పెదతండ్రి లింగన రెండవహరిహర

---

(1) ఆంధ్రదేశమున భాస్కరులచరిత్రమునుఁ దెలిసికొనఁగోరు వారీక్రింది గ్రంథములఁ జూడదగును.

1. ముప్పదియిద్దఱుమంత్రులచరిత్రము- (1839)

2. భాస్కరోదంతము- కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారు (1893)

3. రాయనభాస్కరమంత్రిచరిత్రము-గురుజాడ శ్రీరామమూర్తిగారు (1900)

దేశియందున్న ప్రత్యేకవిశిష్టతను నాగ్రంథమున నెంతయో ప్రతిపాదించియున్నాఁడు. కావుననే కేవల సాంస్కృతికాలంకారదృష్టితో విద్యానాథుఁడు ప్రపంచించినదానిని విశేషములతో కూడ దేశీయపద్ధతుల గమనించి, పెదకోమటి వేముఁడు దీనిని వివరించినాఁడు. కోమటి వేమభూపాలుని లక్షణమునకు సోమనాథుని యుదాహరణము[1] లక్ష్యమై యుండనోపును. కాగా నీయంకితాంకపద్య ముదాహరణములలో పై సంస్కృతలక్షణము ననుసరించి తరువాతివా రనుసరించరని చెప్పనగును.

లఘుకావ్యమే యయ్యు త్రిపురాంతకోదాహరణము చాల వ్యాప్తిలోనుండె ననుట కీక్రిందియనుకరణములు ప్రమాణములు కాఁగలవు.

చ కమలజుతోరపుంబుసుకకంచము, పాదసరోరుహార్చనా
కమలము వారిజోదరుని కన్ను కరంబున కాదిభోగి భో
గము రవణంబు, చంద్రుఁడు శిఖాకుసుమంబటె, యెవ్వరీడు మా
రమణునకుం గుమారగిరిరాజనివాసుప కన్య దైవముల్.

(షష్ఠీవిభక్తి పద్యము)

వీరభద్రవిజయమున బమ్మెరపోతన మహాకవి

ఉ. మేరువు వింటికమ్మి యటె, మేదిని తేరటె, సూర్యచంద్రులిం
పారఁగ బండికండ్లటె యనంతుఁడు నారటె బ్రహ్మవిష్ణువుల్
సారథియుఁ శరంబు లటె సామచయం బటె గుఱ్ఱముల్ మనో
జారికి నెవ్వరీడు త్రిపురాసురవైరికి నన్యదైవముల్ (4-34)

1. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక స్వభాను సం. 32 సంచిక. 3-౮ సంస్కర్తచే ప్రకటితము.

3. చంద్రతారావళి.

4 మదనవిజయము.

సంస్కృతమున ప్రేమాభిరామము.

1. త్రిపురాంతకోదాహరణమునుఁ గూర్చి
ముందు తెలుపఁబడును.

2 అంబికాశతకము.

ఇం దేడుపద్యములుమాత్రము లభించినవి. వాని నిటఁ
బొందుపఱచెదను. శతకమున కంబికా యను మకుటము

ఉ. ఆదిమశక్తి యీతరుణి, । యాద్యకుటుంబిని యీకుమారి, ము
త్తైదువయీతలోదరి, చి । దాత్మక యీసతి, విశ్వమాత యీ
పైదలి, సర్వలోకగురు । భామిని యీచపలాక్షి, యంచు బ్ర
హ్మాదులువచ్చినిచ్చలు హి । మాద్రికి నిన్నెఱిగింతు రంబికా!

ఉ. కూడెడివెండ్రుకల్ నిడుద । కూఁకటిఁ బ్రోవఁగ, బొడ్డుపైవళుల్
జాడలుదోఁప, గ్రొమ్ములక । చన్నులుమించువోలంక, సిగ్గునన్
జూడగ నేరముల్ మెఱుఁగుఁజూపులు నీనహిమాద్రియింటనీ
వాడుట శూలికిన్ మనము । వాడుటగాదె తలంప నంబికా!

ఉ భారతివై సరోజభవు । పాలవసించి, రమావధూటివై
నీరజనాభుఁ జెంది, ధర । ణీధరనందనవై మహేశ్వరుం
గోరి వరించితమ్మ నినుఁ । గొల్వక యూరకయేలకల్గు సం
సారసుఖంబు లీమనుజ । సంతతికిం దలపోయనంబికా!

(ప్రబంధరత్నావళి పుట 53)

చ. బెడఁగగు రత్నదర్పణముఁ । జేరినవెన్నెలవోసి నిచ్చలుక్
దుడువఁగ, పాలసంద్రమునఁ । దోఁచిసుధాకరుమేనికందువో

గడుగఁగ, నేరెటేట సిత। కంజము ముంపఁగ, నైజకాంతితోఁ
దొడరిన తల్లి నీ మొగము । తోసరిపోల్పఁగ జాలునంబికా!

ఉ. తెప్పలఁబోరుఁ దల్పులిసి। తేంతలు వాతెఱచూపుగుంచియున్
ద్రిప్పి తళుక్కునం దెఱచి। తిన్నని మోమునఁ గాయు వెన్నెలల్
ముప్పిరిగొన్న వేడుకలు। మూఁగిన సిగ్గసియాడఁ బ్రీతి నీ
వ ప్పరమేశుఁ జూచి తను। వర్ధము గొంటి పొసంగ నంబికా!

(ప్రయోగరత్నాకరమునం దుదాహృతము.)

ఉ వాలినకన్ను ముంగురులు । వాతెఱ కెంపు మెఱుంగు జంటిపై
గ్రాలెడు తారహారములు । కంకణచారుకరంబు డాపలన్
దూలుచునున్న పయ్యెదయుఁ। దోఁచిన కన్నులు మోడ్చి మోడ్చి నీ
పాలగు నీశు మేను సగ। బాలు మనంబునఁ జేర్తు నంబికా!

ఉ లాఁచిపరాంగనల్ వరవిలాసమనోహరవిభ్రమంబులన్
చూచినఁ జూడఁ డుత్తముఁడు । చూచినఁ జూచును మధ్యముండు దా
జూచిన జూడకుండిననుఁ। జూచు కనిష్ఠుఁడు నన్ను వీరిలో
చూచిన జూడకుండు గుణిఁ। జూచిన చూపున జూడుమంబికా.

(తొలికూర్పునుండి)

ఈశతకమునుఁగూర్చి శ్రీరామకృష్ణకవిగారి యభిప్రాయము నిటఁ బొందుపఱచుట యుక్తము.

"అంబికాశతకమునఁ బార్వతీనాయికాగుణవర్ణనాదులు రసజ్ఞుల కింపుగా మృదుభాషతోఁ గూర్పఁబడినవి. నేఁటికాలమున శృంగారరసపుముద్రసారవిధురులు కొందఱును, భక్తిరసనియమప్రణాళికాపారీణులు గొందఱును నుత్తమదేవతావర్ణన

ముల శృంగారరసభావముల రసాభాసములుగఁ దలచుచున్నారు. దీనిలో నుత్తముదేవతలైనను, నంబికాశివుల పరస్పర శృంగారరసోన్నతి వర్ణింపఁబడినది గాని ధ్వనికారులమతమున రసాభాస మనునది సూచటను గానరాదు"

3. చంద్రతారావళి.

ఇందిరువదేడుపద్యములలో నాలుగుమాత్రమే లభించినవి.

మ. చరమక్ష్మాధరచారుసింహముఖదంష్ట్రాకోటియోనాఁగ నం
బరశార్దూలనఖంబునాఁగఁ దిమిరేభప్రస్ఫురద్గర్వసం
హారణక్రూరతరాంకుశంబనఁగ సురవల్లీల మీరేఖ ని
త్యపచిం బోల్పఁగఁ బెంపఁగు న్విదియచంద్రా! రోహిణీవల్లభా!

మ. అమితధ్వాంతతమాలవల్లిలవన వ్యాపారపారీణదా
త్రమొ, సౌగంధికషండకుట్మలకుటీరాజీసముద్ఘాటన
క్రమనిర్వాణధురీణకుంచికయొ, నాఁగం బెంపుననీకళా
రమణీయత్వముఁ జూడఁ బొప్పెసఁగుచంద్రా! రోహిణీవల్లభా!

మ. రతినాథుండనుమాయజోగిచదలన్ త్రైలోక్యవశ్యాంజనం
బతియత్నమ్మునఁ గూర్చిమౌక్తికమయంబై యున్న పాత్రంబునన్
మతకం బెప్పుడుఁ బెట్టి దాఁచెననమీమధ్యంబునన్ మచ్చసం
తతముల్ కన్నులపండువై వెలయుచంద్రా! రోహిణీవల్లభా!

మ. పాలకయ్యంబులఁ గల్గుముద్దుటలుకన్ బుష్పాయుధారాతిమౌ
క్తులఁ దీర్పన్ దలమీఁద గానఁగునినీ క్రుమ్మేనుపుణ్యాంగనా
తిలకంబైన భవానిపాదనఖసంక్రాంతిం జెందదొందంబులన్
వలఁతాచుక్కలతోఁడిముచ్చటలుచంద్రా! రోహిణీవల్లభా.

ప్రబంధరత్నావళి పుట 54.

## 4. మదనవిజయము

ఇయ్యది యేనిమిదాశ్వాసముల గ్రంథమనియుఁ గామశాస్త్రవిషయికమనియు, నిందు సంజ్ఞాభియోగిక, భార్యాధికార, పారదారిక, వైశికాది ప్రకరణములు గలిగినదనియు వ్రాసి, ప్రతి క్రిమిదష్టమై యుంటనందుండి రెండుపద్యములుమాత్రమే తొలికూర్పున శ్రీరామకృష్ణకవిగా రుదాహరించినారు.

క. సతిగుణవతియగు నేనియు
పతి కది రత్నంబ ప్రాణ బంధువ యమృతం
బతివయదుర్గుణియగు నేఁ
బతి కెడపనిచిప్ప కాలు పకయదికాల్చున్.

మ. గుణముల్ సుందరరూపముల్ విభవముల్ కూటంబు సౌభాగ్యల
క్షణముం జారుచరిత్రముల్ వినయముల్ చాతుర్యముల్ ధర్మభూ
షణముల్ గల్గి పతివ్రతామహిమ మిం చంగల్గెనేఁ దత్సతీ
మణిచింతామణిఁ దానిఁదాల్పగలగల్ మర్త్యుండె మర్త్యుం డిలన్.

పై ప్రకరణవిభాగమును సంస్కృతకొక్కోకమునఁ గలదు. కొక్కోకమును దెలుఁగునరచియించిన కూచిరాజు యెఱ్ఱన త్రిపురాంతకుని నుతియించుట నీగ్రంథకర్తృత్వము నిశ్చయమని చెప్పనొప్పును.

## ప్రేమాభిరామము.

ఇయ్యది సంస్కృతమున వీధిరూపముగా రచియింపఁబడినది. క్రీడాభిరామము దీనియాంధ్రానువాదమని తెలిపితిని.

ప్రేమాభిరామము సంపూర్ణముగ లభించినగాని గ్రంథపరిశీలనమునకుఁ గుదురు గలుగదు. ప్రేమాభిరామము పెదకోమటి వేముని 'సాహిత్యచింతామణి' యను నలంకారగ్రంథమున నుదాహరింపఁబడినది. సాహిత్యచింతామణి యముద్రితమే-అందుండి.

పరారిసందర్శితసన్నివేశౌ
పరుత్పరాభూతపయోజకోశౌ
ఇహైవ మస్తాళఫలోపమానౌ
స్తనౌ కియన్తౌ పురతో భవేతామ్.

అను శ్లోకము సాహిత్యచింతామణియం దుదాహృతము. దీని తెలుఁగుపద్యము.

"దోరసెమునందు చుట్టుకొని తోరణకట్టె నురోవిభాగమున్
నిరుడుపయోజకోశరమణీయతఁ బాల్పెను వర్తమానవ
త్సరమున రొప్పె హేమకలశంబుల బాగున, ముందటేటికిన్
గరినిభయాన చన్నుఁగవ కౌఁగిలిపట్టులు గాకయుండునే."

క్రీడాభిరామమునఁ గలదు. (పుట 86)

మఱియు ప్రేమాభిరామము వృత్తరత్నాకరవ్యాఖ్యయం దుద్ధరింపఁబడినది.

తరుణం సర్షపశాకం
నవౌదనం పిచ్ఛిలాని చ దధీని
స్వల్పవ్యయేన సుందరి
గ్రామ్యజనో మృష్టమశ్నాతి. దీని తెనుఁగుపద్యము.

"శీతకాలంబు కడిమాడ సేయఁగుడుచు
భాగ్యవంతుండు తేపాడిపల్లెపట్ల

గొత్తియో రెంబునిగు రావఁ గూరతోడఁ
పిచ్ఛిలంబైన నేతితోఁ బెరుగుతోడ."
క్రీడాభిరామము 87 పుటలో గలదు.

## 6. ఉదాహరణ గ్రంథములు.

### వాఙ్మయమున నా గ్రంథముల స్థానము.

ఆంధ్రవాఙ్మయమునకుఁ బ్రత్యేక విశిష్టతఁ బ్రతిష్ఠాదించిన గ్రంథములలో మున్నెన్నఁదగినవి యుదాహరణములు. వాఙ్మయచరిత్రకారు లీగ్రంథముల నింతవఱకు శ్రద్ధవహించినట్లు కానరాదు. ఈయుదాహరణములు మనకు లభించినవి కొలఁదిగనే యున్నను, నేఁడీగ్రంథరచనము ప్రాయికముగా నంతరించినను, వీనిపరిశీలనమువలన ప్రాచీనాంధ్రకవితాసంప్రదాయముఁగూర్చియు వాఙ్మయపరిణామముఁగూర్చియు నపూర్వవిషయము లెన్నియేని యెఱుకపడుచున్నవి. సూక్ష్మశోధనాసక్తతయు ద్రష్టృత సంపూర్ణముగఁ గల వాఙ్మయచరిత్రము దక్కఁ దక్కెంగల జాతీయవాఙ్మయస్వరూపమును నెఱుంగని వాఙ్మయచరిత్రకారు లీగ్రంథములు విస్మరించుట వింతగాదు. సూక్ష్మశోధనాపరిశీలనపరు లక్క సంతత గానేక విశిష్టతలు తెలుఁగునకు ఘనతయుం జేసిన ద్విపదలు, యక్షగానములు, శతకములు, గేయములు మున్నగు కావ్యభేదములలోఁ జేరినయుదాహరణములు సంగీతసాహిత్యములకుఁ గల పరస్పరసంబంధమును విశదీకరించుచున్నవి. మఱియు నాంధ్రభాషాతత్త్వవివేచనమునకు, నాంధ్రవాఙ్మయపరిణామనిరూపణమునకు నీయుదాహరణము లెంతయేని తోడ్పడుచున్నవి. కావున నీగ్రంథపరిశీలన మవసరము కర్తవ్యమై యగుచున్నది.

తెలుఁగుకవిత పదకవితయనియు, పద్యకవితయనియు రెండుతెఱఁగులు తెలుఁగునాఁట తొల్లిటినుండియు నెన్నికఁ గన్నది పదకవితయే. ఏవాఙ్మయమునం దైన పద్యకవితకన్న పదకవితయే ముందైనను తెలుఁగున నొకకాలమునఁ బదకవిత యు, వేఱొకకాలమున పద్యకవితయుఁ బెంపుఁ జెందినట్లు కవితాసంప్రదాయములు తెలుపుచున్నవి. ఈరెండింటికి మార్గ మనియు దేశియనియు వ్యవహారము గలదు. మార్గదేశిపదములు సంగీతశాస్త్రసాంకేతికములు. సార్వదేశికముగ సంస్కృతమై గ్రాహ్యమగునది మార్గమనియు, నేకదేశికముగ దేశభాషా సహజమగునది దేశియనియుఁ జెప్పనగును. దేశభాషలయందు సాహిత్యశాస్త్ర మభివృద్ధియైనవెనుక భాషావాఙ్మయవిషయ మునఁగూడ నీపదములుపయుక్తమైనవి. కావున సంస్కృతపద సమ్మిళితమై, తల్లక్ష్యలక్షణసముచితమగు కవిత మార్గమనియు, దేశ్యపదపూరితమై జాతీయమగు కవిత దేశియనియుఁ దెలియ నగును. దేశియనఁగా మనోహరము జాను ననునర్థము దెనుఁగు ననేగాక కర్ణాటభాషయందుఁ గలదు. అత్యంతమృదులమును నాపాతమధురము నై మనోహరమగు తెనుఁగుకవితకు దేశి యనుపే రెంతయుఁ దగియున్నది. మార్గకవిత యక్షరగణనిబద్ధ మై సంస్కృతవ్యాకరణచ్ఛందోనువృత్తమై యుండును. దేశికవిత మాత్రాగణనిబద్ధమై యాంధ్రచ్ఛందస్సంప్రదాయికమై యుం డును. దేశికవిత యాంధ్రతాముద్రఁ గలిగి తెలుఁగుపలుకులతీరు తీయములు తెల్లము సేయుచుండును. తెలుఁగునాట తొలుత నీదేశికవితయే పెంపుఁ జెందినను గాలక్రమమున సంస్కృతభాషా సాహచర్యమున మార్గకవిత రాజాదరణముఁ బడసి, దేశికవితను

మలుఁగువడఁ జేసినది. గీర్వాణపదకవితావ్యామోహమున లాక్షణికు లీపదకవితను నెక్కువగఁ బాటింపరైరి. కావుననే నేఁటి యాంధ్రసాహిత్యోపాసకులకు నంధ్రకవిత యథార్థ కథన మశ్రుతపూర్వమైనది.

ఉదాహరణస్వరూప మీయుభయపథకముల సమ్మేళమును విశదీకరించుచు నన్నయోపజ్ఞమగు మార్గకవితాప్రపంచమునకు దొలిసర్గమైనది-ఉదాహరణములు వృత్తము, కళిక, ఉత్కళికయని మూఁడుభాగములుగ నున్నను ఉత్కళిక, కళికయం దొకభాగమగుటచే నిది రెండుభాగములనియే చెప్పవగును. ఇందు తొలిభాగమున సాధారణములగు చంపకోత్పలశార్దూలమత్తేభవృత్తములు సంస్కృతచ్ఛందస్సంజాతములు. మార్గకవితానుయాయికములు - కళికోత్కళికలయందుఁ జెప్పబడురగడలు జాతులలోఁ జేరినవి. ఇవి యంధ్రచ్ఛందోనిబద్ధములు- తెలుఁగున సీసములు, నక్కరలు, తరువోజలు, ద్విపదలు, రగడలు, కందములు మున్నగుజాత్యుపజాతిభేదములు క్రీ. శ. 9 వ శతాబ్దమునుండి ప్రచారములో నున్నట్లు శాసనాదులవలనఁ దెలియుచున్నది. చంపకమాలికాదివృత్తసమన్వితమగు మార్గకవితగూడ వీనితోపాటు వర్థిల్లుచున్నట్లు శాసనాదులే తెలుపుచున్నవి. దీనింబట్టి చూడ నంధ్రమున విశిష్టకావ్యరచనమునకుఁ బూర్వమీయుభయకవితారీతులు! వేలువేలఁ బెంపుఁ జెంది కావ్యరచనాప్రారంభమున సమ్మేళనముఁ జెందెననియు, నట్టిసమ్మేళనమే భారతాదిగ్రంథరచనాపాటవమునకు బాట యయ్యెననియు, నట్టిసమ్మేళనము గ్రంథరీతిని మన కుపలబ్ధమగు వాఙ్మయమునఁ దొలుత యుదాహరణమునఁ గానవచ్చుటచే ప్రాచీ

నాంధ్ర గ్రంథస్వరూపము నీయుదాహరణము విశదము చేయు చున్నదనియుఁ జెప్పనగును.

ఆంధ్రకవితాపరిణామముఁ దెలిసికొనుటకు నుదాహరణము లుపయుక్తములు. తెలుఁగుకవిత ఏకపదమై, ద్విపదమై, త్రిపదమై, చతుష్పదపరిమితమై పరిణితిఁజెందినట్లు గానవచ్చు చున్నది. ఏకపదములగు పాటలును, ద్విపదములగు ప్రబంధములు, గానయోగ్యములగు త్రిపదాది సంయుక్తములగు యక్షగానములును, సలక్షణావృత్తకవితాసమన్వితములగు భారతాది గ్రంథములును వాఙ్మయవీథిని ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ ఘట్టములు. ఉదాహరణము లీతృతీయఘట్టమునఁ జేరినవి. ఉదాహరణములు ద్విపదప్రబంధాదులవలె నొకేవిధమగు ఛందస్సుతోఁగాక పదకవితయందలి ఛందోవిశేషములను గలిగి యుండును. యక్షగానాదుల యందువలె కేవల గానయోగ్యమగు పదములు హెచ్చుగా నుండకపోయినను, లయతాళ సమన్వితమగు పదములతో, వృత్తరచనము గలిగియుండుటచే నివి ద్విపదప్రబంధకవితకుఁ జివరను, యక్షగానకవితకు ముందు నను బుట్టినవి యని నిశ్చయింప నగును.

## 7. సంగీతసాహిత్యముల సంబంధము.

యక్షగానకవిత్వమువ ఉదాహరణకవిత్వము ముందను విషయము సంగీతసాహిత్యములకుగల పరస్పరసంబంధమును కొంతవఱకు విశదము చేయుచున్నది. ఉదాహరణమున రగడలు తాళాంగప్రధానములు. తాళాంగమున చతురశ్ర త్ర్యశ్ర మిశ్రజాతులు ప్రకటితము లగుచుండును హరగతియను రగడకు నాటతాళము, హయప్రచారము, తురగవల్గనము, విజయ

మంగళము, వీనికిరూపకతాళము- మధురగతియను రగడకు నేకతాళము, ద్విరదగతి, విజయభద్ర వీనికి జంపెతాళము, హరిణగతి, వృషభగతులకుఁ ద్రిపుట తాళమును లాక్షణికులు నిర్వచించిరి. కావున నీరగడల నాయాతాళలయాన్వితముగఁ బాడుచుండెడివారని తెలియుచున్నది. యక్షగానములఁ బద కవితయందలి భేదములు సంపూర్ణ తాళలయాన్వయములుగా పరిణతిఁజెంది సంగీతశాస్త్రానుగుణ్యముగ నుండుననువిషయము మనకు సుపరిచితమే మఱియు నవ్యక్తమధురమగు గానమునకు, సువ్యక్త మధురమగు తెలుఁగుకవితకుఁ గుదిరికఁగూర్పుటలో నీయుదాహరణగ్రంథములే మొదలని యూహింపఁదగి యున్నవి.

## 8. సప్తవిధవిభక్తిపరిణామము.

ఉదాహరణగ్రంథములు భాషాతత్త్వవివేచనమునకుఁ గూడ తోడ్పడుచున్నవి-ఉదాహరణముల సప్తవిభక్తిరూప ముల నాధారముగాఁ జేసికొని, యొక్కొక విభక్తికి మార్గజాతి పద్యముల నావిభక్త్యంతములఁ గూర్పుటచే, నివి కేవలము విభక్తిప్రత్యయ ప్రచురణమునకైఁ పుట్టినట్లూహింపఁ దగియు న్నవి. విభక్తిప్రత్యయసరణి భాషయందు చక్కఁగ నేర్పడినతరు వాతనే నీయుదాహరణములు వర్ధిల్లెనని చెప్పుటకు సందియము లేదు. అయిన నేఁడంధ్రవైయాకరణులు చెప్పిన విభక్తి ప్రత్యయములన్నియు నుదాహరణముల నుపయుక్తముకాలేదు. ఈవిషయము తెలుఁగున విభక్తిప్రత్యయపరిణామముఁ దెలిసి కొనుటకు మంచిసాధనము. తెలుఁగువిభక్తులు, ప్రత్యయములు, మొదలగువానిఁ గూర్చిన యాంధ్రవైయాకరణుల వివేచనము

భాషాతత్త్వమునకుఁ గుదురుపడుటలేదు. ఆంధ్రవైయాకరణులు సంస్కృతమున నేడువిభక్తులుగనుక తెలుఁగునను నావిభక్త్యర్థమును సూచించుపదములు విడదీసి వాని నేడువిభక్తులుగాఁ జెప్పిరిగాని, పరిశీలించిన సంస్కృతాంధ్రవిభక్తుల కేమాత్రము సంబంధములేదు. తెలుఁగున విభక్తిప్రత్యయములు సంస్కృతమువలెఁగాక భాషయందు స్వతంత్రప్రయోగముగలిగి స్వతంత్రార్థబోధకమగు శబ్దములు సంస్కృతమున విభక్తికివచనముఁ బట్టి ప్రత్యయభేదమున్నది. నామాంత్యాక్షరము ననుసరించి ప్రత్యయము మాఱుచుండును. మఱియు వేఱువేఱర్థమున సంస్కృతమున నొకేవిభక్తికి రెండుప్రత్యయములు లేవు. తెలుఁగు విభక్తులకు పైలక్షణములన్నియుఁ గలవు ప్రస్తుతము తెలుఁగున సప్తవిధవిభక్తులివి.

ప్రథమ—డు, ము, వు, లు.
ద్వితీయ—ని, ను, ల, కూర్చి, గుఱించి.
తృతీయ—చేత, చేన్, తోడ, తోన్.
చతుర్థి—కై, కొఱకు.
పంచమి—వలనన్, కంటె, పట్టి.
షష్ఠి—కి, కు, యొక్క, లో, లోపల.
సప్తమి—అందు, న.
సంబోధనము. ఓరి, ఓసి, ఓ, ఓయి.

పైప్రత్యయములలో, ౧. ప్రథమయందు : డు, ము, వు, లు, ౨. ద్వితీయ: ని, 3. తృతీయ: చే, చేత, ౪. చతుర్థి: కై, ౫. పంచమి: వలన, ౬. షష్ఠి: కు, ౭. సప్తమి: అందు, అను ప్రత్యయము లుదాహరణముల వాఁడబడినవి.

బసవోదాహరణమునందు చతుర్థీవిభక్తిరూపము బసవయ్యకు'నై' అనికలదు. తరువాతియుదాహరణములలోఁ ద్రిపురాంతకోదాహరణమునను, వేంకటేశ్వరోదాహరణమునను నీరూపము గనవచ్చుచున్నది. అప్పకవి యుదాహరణమునాఁటికి లేదు. చతుర్థీవిభక్తియందు 'ఐ' అనుప్రత్యయమునకే 'కొఱకు' 'నిమిత్తము'నని యర్థము. చతుర్థీవిభక్తియందు నేఁడు కానంబడు 'కొఱకు' అనునది ప్రాచీనకాలమున వాడుకలేదు. షష్ఠ్యర్థమందుఁగల కిన్, కున్ ప్రత్యయములకు 'ఐ' చేర్చుటచే కునై రూపమేర్పడినది. 'కొఱకు'విభక్తిరూప మింతరువాతిది. ఈ 'కొఱకు' అనువిభక్తిరూపము, కొఱయనుశబ్దమునకుఁ గు ప్రత్యయముఁ జేర్చుటచేఁ గలిగినది. కాని నన్నయకాలమున వాడుకలో లేని 'కొఱకు' ననువిభక్తికి, నన్నయకృతమని చెప్పఁబడు నాంధ్రశబ్ద చింతామణిలో 'కొఱకు కయి చతుర్థ్యాస్స్యుః' అని యేల సూత్రింపఁబడెనో? ఆంధ్రభాషాభూషణకారుఁడు, కేతన చతుర్థికి షష్ఠియే నిలుచునని చెప్పెడి సూత్రమాతనికాలమువఱకు నీ'కొఱకు' విభక్తిరూపము వాడుకలో లేదని తెలుపుచున్నది. అప్పకవియుదాహరణమున నీరూపము లేకపోవుటచే పదునైదు పదునాఱవ శతాబ్దములనుండి యీరూపము వాడుకలోనికి వచ్చెనని యూహింపవచ్చును. ఇట్లు, విభక్తిపరిణామమును కొంతవఱకుఁ దెలిసికొనుటకు నీయుదాహరణగ్రంథములు తోడుపడుచున్నవి.

## 9. ఆశ్వాసాంతవిభక్తిరచన-షష్ఠ్యంతములు.

ఆంధ్రప్రబంధములయందీవిభక్తివిధాన ముదాహరణములవలెఁ బాటించిరని చెప్పనగును. నన్నెచోడుని కుమార

సంభవము, భాస్కరరామాయణమున నరణ్యకాండము, తిక్కన నిర్వచనోత్తర రామాయణము, కేతన దశకుమారచరిత్రము, మంచన కేయూర బాహుచరిత్రము, కొరవి గోపరాజుసింహాసన ద్వాత్రింశిక, విన్నకోట పెద్దన కావ్యాలంకారచూడామణి మొదలగువానిఁ జూడుడు వానియం దాశ్వాసాంతములు తరువాతి ప్రబంధములందువలె సంబోధనాంతములుగా లేవు. ఏదేనొకయాశ్వాస మొకవిభక్తితో నంతము చేసిన, తరువాతి యాశ్వాసము నావిభక్తితోడనే ప్రారంభించుటపై కావ్యములలోఁ గానవచ్చుచున్నది. తిక్కననిర్వచనోత్తర రామాయణమున నీవిధముగనే యున్నను, భారతమున నాశ్వాసాంతములు సంబోధనాంతములు. తిక్కనసోమయాజి తొలికృతియగుటచేఁ గాఁబోలు నిర్వచనోత్తర రామాయణముననీనియమముపాటించి, తరువాత భారతమున నీనియమము పాటింపలేదు. ఈసంప్రదాయ మధునాతను లెఱుఁగుదు రనుటకుఁ గడచిన శతాబ్దిని ప్రామాణికుఁడని ప్రఖ్యాతిఁగాంచిన చిన్నయసూరి తన శబ్దలక్షణసంగ్రహమున నీవిధముగనే వ్రాయుటతార్కాణము. కావున నిది మార్గకవితాసంప్రదాయజ్ఞుఁడగు నన్నయ భారతమందు వెలయకున్నను, దేశికవితఁ బెంపుచేసిన నన్నెచోడాది మహాకవు లీదేశికవితాసంప్రదాయమునుఁ బోషించినవా రగుటచే దీని పాటించిరనియు, తిక్కనయు దేశికవితాసంప్రదాయజ్ఞుఁడగుటచే, నీప్రాచీనసంప్రదాయమును దన తొలికృతియందు నిలిపెననియు, నావెనుక తన యంత్యకృతి యగు భారతమున విడిచిపెట్టెననియుఁ జెప్పవచ్చును.

మఱియు నాశ్వాసాంతములు ద్వితీయావిభక్తియం దుం డుట, రంగనాథ రామాయణాది ద్విపద కావ్యములయందే గాకఁ యక్షగానములయందు నైతము గాన వచ్చుచున్నది. కాని వీరి కంటె ప్రాచీనుఁడగు పాల్కురికి సోమనాథుని ద్విపద గ్రంథము లలో నీనియమము గానరాలేదు. బసవపురాణ, పండితారాధ్య చరిత్రల సంబోధనమే యాశ్వాసాద్యంతముల గలదు. కాని తరువాతి ద్విపదకృతులలో నీ నియమము గానవచ్చుచున్నది. ఇదియును దేశికవితా సంప్రదాయమే. ఇది యక్షగానాదుల యందుఁ బాటింపఁబడుటచే నుదాహరణలక్షణములలో నొకటి యాంధ్రకవితయందు మనకు నేఁటికిని ముద్రితమై యున్నదని చెప్పనొప్పును.

ఇదియేగాక ప్రబంధములో నియతమగు షష్ఠ్యంతము లుగూడ నీ నిలిచియున్న యుదాహరణలక్షణములలో నొకటి. ఉదాహరణముల నెవరినిగూర్చి చెప్పుదురో వారికిఁగదా సప్త విభక్తిరూపములుఁ జెల్లుచుండును. మన కృత్యాదినిఁ బరిశీలింప గాఁ గృతిభర్తనుఁగూర్చి వర్ణించుటయందుఁ గృతిభర్త యిట్టి వాఁడనియు, వానిఁ బేర్కొనుట సముచితమనియు, వానిచే నీఘన కార్యములు వెలసెననియు, వానికై కృతినిత్తుననియు, వాని కీ విశేషణములుగలవనియు, వానికి నంకితంబుగా నీకృతి రచి యింతుననియు, సార్వవిభక్తికముగాఁ దొల్లి చెప్పుచుండిరనియు, నాపై కథాప్రారంభమున సంబోధముతో ప్రారంభించు చుండిరనియుఁ, గొంత కాలమునకు వెనుక పై విభక్తులలోఁ దక్కినవానిఁ జెప్పక షష్ఠ్యంతముల నొకదానినే జెప్పుచుండి రనియు, నదియే తరువాత శిష్టాచారమయ్యెననియుఁ దలఁచు

చున్నాఁడను. షష్ఠ్యంతములు నేఁడు మన కుపలబ్ధములైన గ్రంథములలోఁ దొలుత బండితారాధ్యులశివతత్త్వసారమునను నన్నెచోడుని కుమారసంభవముననుఁ గానవచ్చుచున్నది. ఆరాధ్యులవారికాలమునకు ముందుగా నీయుదాహరణము లున్నవి. కావున షష్ఠ్యంతములు నీయుదాహరణములకు సంబంధించినవి యేయని తెలియుచున్నది.

## 10. దేశీయచ్ఛందోవిశేషములు.

దేశీయచ్ఛందస్సునకు సంబంధించిన జాత్యుపజాతులలో రగడకు రఘట, సీసమునకు శీర్షకము, భరతుని నాట్యశాస్త్రమున లక్షణములతోఁ బ్రపంచితమైనది. భరతనాట్యశాస్త్రమున శీర్షకమను నొక ప్రత్యేకాధ్యాయమే గలదు. శీర్షకమునకు జానాశ్రయి ఛందోవిచితియందును, ద్విపదమునకు కేదారభట్టు వృత్తరత్నాకరమునను లక్షణములు చెప్పఁబడియున్నవి. కాని యంతమాత్రమున నీజాత్యుపజాతులు కేవలసంస్కృతచ్ఛందస్సునుండి పుట్టినవనుకొనుట సమంజసముగాదు. ఏజాతివారికైన జాతీయవాఙ్మయము తొలుత పదరూపమునుండ వాని నుండియే ఛందస్సు లావిర్భావముఁ జెందుచుండును. ద్రావిడకర్ణాటాంధ్రభాషలలో ముఖ్యముగ తెలుఁగుభాషకు నార్యభాషాసంసర్గమును సంస్కారమును హెచ్చుగానుండుటచే నీసంస్కృతిఁ జెందిన ఛందోరూపములే భారతీయాదులఁ బ్రపంచితములయ్యెనని యూహింపఁ దగియున్నది. భారతీయమున నున్నంతమాత్రమున శీర్షకమునకుగాని, రగడకుగాని సంస్కృతమునఁ బ్రచారముగలదా? తెలుఁగువారు భాషావిషయమున సంస్కృతపదముల నెంతవఱకు భాషానుగుణ్యముగ రసస్ఫోర

కముగనుండునని యుపయోగించిరో, ఛందోవిషయమునగూడ సంస్కృతవృత్తములను భాషానుగుణ్యముగ నున్నవానిఁ గొన్నిటిగ్రహించి, యుపయోగించి జాత్యుపజాతులతో సంపుటీకరణముఁగావించి కవితలవెలయించిరి. కావుననే సంస్కృతచ్ఛందస్సంజాతములగు శార్దూలమత్తేభవృత్తములు ప్రచారమున నున్నను, సంస్కృతీయములని చెప్పబడు చంపకోత్పలములకు తెలుఁగునందువలె సంస్కృతమున నే ప్రచారము లేదు. వీనిఁ దెలుఁగువా రించుమించుగ తమస్వంతము గావించికొనినారు. సంస్కృతమున నలినమనోహరముగనుండు, వసంతతిలకము, మందాక్రాంత, ఉపజాతిమున్నగు వృత్తములకుఁ దెలుఁగున నంతగా ప్రచారము లేదు. ద్విపద సంస్కృతమున వాడుక లేదు. తెలుఁగునకు ద్విపద ప్రత్యేకవిశిష్టత సంపాదించినది. దీనిఁబట్టి చూడ తెలుఁగువారు సంస్కృతచ్ఛందస్సునుండి వలయుసాధన సామగ్రిని సందర్భానుసారముగ వాడుకొనుచుండిరనియు, నంత మాత్రమున నాంధ్రచ్ఛందస్సు తనవ్యక్తిత్వము గోలుపోలేదనియు మనపదచ్ఛందః పరిశీలనము పరిణితిఁ జెందిన, మనజాతీయ వాఙ్మయస్వరూపముఁ జక్కఁగ విశదమగుననియు నుదాహరణ గ్రంథపరిశోధనమువలనఁ దెలియుచున్నది.

పదకవితయందలి యనాదరణచే సంస్కృతాలంకారికులును వారిననుసరించి తెలుఁగులాక్షణికులునుదాహరణములను క్షుద్రకావ్యములలోఁ జేర్చినారు. ప్రాచీనకాలమున వెలసిన యుదాహరణములు ప్రశస్తకవితాసమన్వితములై కావ్యగౌరవమునుఁ బడసినవి. పరిణామమునఁ జిన్నవియయ్యును ప్రతిభాసంపత్తిని మిన్నలై శబ్దార్థప్రతిపత్తిని గలిగియున్నవి.

## 11 సంస్కృతోదాహరణములు.

సంస్కృతమున నుదాహరణములున్నను నీయుదాహరణ లక్షణము నాంధ్రోదాహరణలక్షణముతో భేదించుచున్నది ఈ విషయమునఁ గూడ నాంధ్రోదాహరణము ప్రత్యేకవిశిష్టత విశదమగుచునే యున్నది సంస్కృతోదాహరణమునకు లక్షణము ప్రతాపరుద్రీయమునం దిటులఁ జెప్పఁబడినది.

"యేనకేనాపి తాలేన గద్యపద్యసమన్వితమ్
జయేత్యుపక్రమం మాలిన్యాదిప్రాసవిచిత్రితమ్
తదుదాహరణం నామ విభక్త్యష్టాంగసంయుతమ్."

కాని యీయుదాహరణములు సంస్కృతమున కాళిదాసుని కాలముననుండియు నున్నటుల మనకుఁ దెలియుచున్నది. రఘువంశమున 'జయోదాహరణం బాహ్వోర్గాపయామాస కిన్నరాన్' అనియు విక్రమోర్వశీయమున 'పత్రేనివేశిత ముదాహరణం ప్రియాయాః' అనియును కాళిదాసు రెండుతడవ లుదాహరణములఁ బేర్కొనినాఁడు. కాని సంస్కృతమున నుదాహరణములు పైలక్షణమునకు లక్ష్యముగా నొకటియు నుదాహరణమునకైనఁ గానరాలేదు. పైలక్షణమునను సరింపని యుదాహరణముమాత్ర మొక్కటి సంస్కృతమున నిటీవల లభించినది.

సంస్కృతమున నీయుదాహరణముఁ బసవలాక్షణిక శైవకవిసార్వభౌముఁడు పాల్కురికిసోమనాథుఁడు రచియించినాఁడు ఇదియుఁ బండ్రెండవశతాబ్దమునాఁటిది.[1] ఈయుదాహ

1. దీనిని నేనును, మిత్రులు బండారు తమ్మయ్యగారును ఆంధ్ర సాహిత్యపరిషత్పత్రిక(సం. 32-3-4)లోఁ దెలుఁగులిపిలోఁ బ్రకటించితిమి.

రణ మాంధ్రోదాహరణలక్షణము ననుసరించియున్నదనుట కందుండి కొన్ని విభక్తులనుదాహరించుచున్నాఁడను.

ప్రథమావిభక్తికళిక.

అపిచపురాతననూతన శివగణపాదోదకపరిలసదభిషేకః
ఉపితవికల్పవ పల్లవజంగమ లింగసమర్చన నిచితవివేకః
సతతవికస్వరభాస్వర నిజముఖమండలఖండిత రజనీనాథః
కృతయుగవర్తనకీర్తననిరసననిపుణపవిత్ర చరిత్రసనాథః
ప్రకటితదర్పక దర్పకరేణు ప్రమథన నిశితకరాంకుశహేలః
శుకముఖమానస కమలాకర విహరణచణరాజమరాళః
స్వానుభవాంచిత కూడలిసంగమ సంతతదేవధ్యానాభిజ్ఞః
సూనృతభాషణ భూషణవాణీసింహాసన గంభీరరసజ్ఞః

ఉత్కళిక.

శ్రుతిముఖరస్వరసరససమేత
స్మృతినికురుంబరసాయనగీత
ప్రముదితహృద్వర్తనశితికంఠ
శమదమములాలన గుణితోత్కంఠః

సప్తమీవిభక్తిలోఁ గళిక.

అపిచాధార సురంగజ్ఞాతరి
సుపథపథికచిత్సుఖ సంధాతరి
వర్గచతుష్టయ దాపనశీలిని
దుర్గనిరసన కరుణాశాలిని
... ... ...

ఉత్కళిక.

సుకేసరమందర
నిరుపమకంధర

ఘనహారిచందన
వనమయనందన

అంతము.

యస్సంగీతసిధి ర్వ్యమాహబరభవం, యేనార్చితంసూనృతం
యస్మైశ్రస్వస్తి, యత స్తవీయముదభూద్వ్యద్వీరశైవవ్రతం
యస్యాపాంగ సహోదరిచ కరుణా, యస్మిన్మహాత్వాదికం
స త్వం త్రిణిజగంతి పాహిబసవామాత్యేశచూడామణే!

సంస్కృతోదాహరణ మాంధ్రోదాహరణలక్షణముల ననుసరించి యున్నదనుటకు పై యుదాహరణము చాలును. పై యుద్ధృతభాగమునందు ప్రథమావిభక్తి కళిక సంస్కృతముననున్న వృషభగతి రగడ- తెలుఁగునవలె నంత్యానుప్రాస మిందుఁ బాటింపఁబడినది. మఱియు నుదాహరణము చివర సార్వవిభక్తికముగా నుండుశ్లోక మాంధ్రోదాహరణలక్షణమే గాని సంస్కృతోదాహరణలక్షణము గాదు. ప్రతాపరుద్రీయలక్షణానుసారమున నిందు జయత్యుపక్రమము గాని, మాలినీవృత్తములు గాని లేవు. కావున నిది సంస్కృతమున నున్నను కేవలాంధ్రమునకు సంబంధించినదియే యని చెప్పనొప్పును. పాల్కురికి సోమనాథుఁడు దేశీయచ్ఛందస్సు ననుసరించియే సంస్కృతమున నీయుదాహరణము రచియించి యుండునని నాయభిప్రాయము. ఈయుదాహరణరచనమున దేశికవితాగౌరవమును పాల్కురికి సోమనాథుఁ డెంతవఱకుఁ బోషించినదియు తెలియఁగలదు. సంస్కృతమున నీయుదాహరణములంతగా వర్ధిల్లమికిఁ గారణము గానయోగ్యములగు రగడాది వృత్తములకుఁ బ్రచారము లేకుండుటయని తలపనగును.

సంస్కృతమున నుదాహరణములందుగాక ప్రత్యేకముగ సార్వవిభక్తికముగా శ్లోకములుండుట క్వాచిత్కముగఁ గాన వచ్చుచున్నది.

కృష్ణో రక్షతు నోజగత్త్రియగురుఃకృష్ణం నమస్యామ్యహం
కృష్ణేనామరశత్రవో వినిహతాః కృష్ణాయ తస్మైనమః
కృష్ణాదేవ సముత్థితం జగదిదం కృష్ణస్య దాసోఽస్మ్యహం
కృష్ణే తిష్ఠతి సర్వమేతదఖిలం హేకృష్ణ! రక్షస్వమామ్.
ముకుందమాల-కులశేఖరాళ్వారు.

సంస్కృతమున రగడలకునంతగాఁ బ్రచారము లేదనుటకు నొక యుదాహరణముఁ జూపుచున్నాఁడను. సోమదేవుని యశస్తిలకచంపువు. 1916 సంవత్సరమున నిర్ణయసాగర ముద్రాలయమున ముద్రితమైనది. అందలి 15-16 పుటలయందొక రగడభేదము వచనముగా ముద్రింపఁబడినది.

'వికచకర్ణోత్పలస్ఫురితతరళేక్షణాః కేళితాళక్వణత్కనకమయకంకణాః సరసనఖరాజి విచ్ఛురిత భుజమండలాః కాంచికోల్లాస వశదర్శితోరుస్థలాః స్వైరసంజల్పనస్మేరబింబాధరాః కర్ణకండూమిషోద్వలిత కక్షాంతరాః పృథునితంబస్థలల్లటహాగతి విక్రమాః సహజశృంగార రసభరిత ముఖభ్రమాః.
పైవచనమును

వికచకర్ణోత్పలస్ఫురితతరళేక్షణాః
కేళితాళక్వణత్కనకమయకంకణాః
సరస నఖరాజి విచ్ఛురితభుజమండలాః
కాంచికోల్లాస వశదర్శితోరుస్థలాః
స్వైర సంజల్పన స్మేర బింబాధరాః ..

కర్ణకండూమిషోద్వలితకక్షాంతరాః
పృథునితంబ స్థలల్లటహాగతి విక్రమాః
సహజశృంగార రసభరితముఖవిభ్రమాః

ఇట్లు ముద్రించిన నిది రగడ భేదముగా నేర్పడుచున్నది. ఇది తెలుఁగున ద్విరదగతి రగడకు సరిపోవుచున్నది. మఱియు నిందు తెలుఁగునవలె రెండేసిపాదముల కనుప్రాసము పాటిం పఁబడినది. ఇంకను మాత్రాగణనిబద్ధములగునవి యశస్తిలక చంపువున గలవు. దానివ్యాఖ్యాత శ్రుతసాగరుడు వీని వ్యాక రించుపట్ల నేమియుఁ దెలుపక యట్లే విడిచినాఁడు. ఈగ్రంథ పరిష్కరణము గావించినవారికి నీఛందస్సంప్రదాయముఁ దెలి యక పైవిధముగ వచనముగా ముద్రించినారు. రగడలు దేశీ యచ్ఛందస్సునకు సంబంధించినవి. సంస్కృతము వీనికంతగాఁ బ్రచారము లేదనుటకుఁ బైయుదాహరణముఁ జూపితిని. దేశీయ చ్ఛందఃపరిశీలనమున నాంధ్రచ్ఛందస్సు ప్రత్యేకత గోచరింపఁ గలదు.

మఱియు నీసందర్భమున సంస్కృతలాక్షణికు లీయుదా హరణములఁగూర్చి వ్రాసినవాని నెఱుంగుట యావశ్యకము.

## 12 కళికోత్కళికలు.

1. కేవలమాత్రాగుణప్రధానములని భరతనాట్యశాస్త్ర మీవిధముగ వాని నిర్వచనముఁ దెలుపుచున్నది.

'గుర్వాది రథ లఘ్వాది ర్వ్యగ్మః సర్వలఘుస్మృతః
నుతుర్మాత్రాగణాజ్ఞేయాః పూర్వచ్ఛందోఽపికల్పనాః
తతోఽర్థకలికాన్ పాతాళ్ గుర్వ్ల ల్లఘ్వక్ష రేషుచ

గుర్వక్షరే తాలగీతపాలాస్తు కలికాస్స్మృతాః'
నాట్యశాస్త్రము 31 అధ్యాయము, 217-18 శ్లోకములు.

2 అర్ధకళికయనఁగ నుత్కళిక - ఉత్కళికాలక్షణమును బ్రత్యేకముగ వామనుఁడు కావ్యాలంకారసూత్రవృత్తి యందిచ్చినాఁడు.

గద్యం వృత్తగంధి చూర్ణ ముత్కలికాప్రాయం చ
పద్యభాగవ ద్వృత్తగంధి
అనావిద్ధలలితపదం చూర్ణమ్.
విపరీత ముత్కలికాప్రాయమ్. [I. 3. ౨౩-౨౬]

దీనిపై గోపేంద్ర తిప్పభూపాలుని కామధేను వ్యాఖ్య:
'ఉత్కలికాప్రాయమితి - ఉత్కలికా ఉత్కంఠా 'ఉత్కంఠో త్కలికే సమే' ఇత్యమరః. ఉత్కలికాయాః ప్రాయః ప్రయోగ బాహుల్యమ్ యస్మిన్ స్తత్ ఉత్కలికాప్రాయం గద్యమ్ యస్మిన్ శ్రూయమాణే శ్రోతౄణా ముత్కంఠా బహుళా భవతీత్యర్థః. యద్వా కలికాశబ్దోఽత్ర లక్షణయా రుహారుహికాయాం వర్తతే-ఉల్లసంతీ కలికాం రుహంరుహికాం ప్రతిప్రాప్నోతీత్యుత్కలి కాప్రాయమ్ యత్ర పదసందర్భపరిపాటీ కాండోప కాండసంరోహశాలినీ కలికేవోల్లసతి తదుత్కలికాప్రాయ మిత్యర్థః.'

3. 'ప్రథమ మపరచరణసముత్థం శ్రయతి యది స లక్ష్మా
ఇతర దితరగదితమపి యదిచతురశ్రమ్
చరణయుగళక మవికృతమపరమితి కలికా సా.'

వచనము.గ...త్తరత్నాకరము. ఉక్తిచ్ఛందోభేదము.
దీనిని వ్రాసెనో ...తమున నుత్కళికాలక్షణము గద్యమునకుఁ జెప్పఁ

బడినది. ఇచట, చిత్ర మేమన, నీగద్యమంతయు శ్లోకమయ మగు రగడవృత్తమే. సంస్కృతచ్ఛందస్సున దీని ప్రచార మంతగా లేనికారణమున నిట్టి గద్యలను ముద్రించినవారు వీనిని వచనముగా ముద్రించినారు కాని దానిని అనుప్రాసములు కానవగునట్లొకదానిక్రింద నొకటి ముద్రించిన నిజము గానవచ్చును.

పాల్కురికి సోమనాథుడు వ్రాసిన సంస్కృతగద్యలీయుత్కళికలే! — చూ. సోమనాథుని పంచప్రకారగద్య అంతము.

'జయశివరంజన, జయభవభంజన, జయకరుణాకర, జయసురభీకర, జయగతదూషణ, జయఋతభాషణ, జయగణరాజిత, జయగణపూజిత, జయజయ శ్రీబసవదండనాథ నమస్తే'-ఇదియే.

జయ శివరంజన
జయభవభంజన
జయకరుణాకర
జయసురభీకర
జయగతదూషణ
జయఋతభాషణ
జయగుణరాజిత

పై విధముగ ముద్రించిన నిదిసప్తమీవిభక్తి యుత్కళికను దీనికి భేదములేదు గదా!

'సురగిరిమందర
నిరుపమకందర
ఘనహారిచందన
వనమయనందన.'

రేఫుంచ

పాల్కురికి సోమనాథుడు 'ఆరూఢగద్యపద్యాదిప్రబంధ పూర్ణశబ్దరచన' యనుచో గద్యమును నిట్టి వృత్తగంధి యని యెఱుంగునది. అచ్చట గద్యమన నేఁటివచనముగాదు.

## 13 ఆంధ్రోదాహరణములు - లక్షణములు.

ఆంధ్రలాక్షణికులలో నుదాహరణలక్షణము తొలుత, ననంతుని ఛందోదర్పణమున నీయఁబడినది. ఛందోదర్పణము కన్న మున్నెన్నఁడు కవిజనాశ్రయమున * నుదాహరణము లేదు. అనంతు నివెనుక, పెద్దన కావ్యాలంకార చూడామణిలోను, చిత్రకవి పెద్దన లక్షణసారసంగ్రహమునను, అప్పకవీయమునను నీయుదాహరణలక్షణములు లక్ష్యములతో సహితముగా నీయఁబడియున్నవి. అనంతఛందమున:

సీ. భాసిల్లు సప్తవిభక్తులందును మఱి
సంబోధనంబును సరవిఁ గాఁగ
ప్రథమాదియుతముగాఁ బద్య మొక్కటియును
దగఁజెప్పి రగడభేదంబులందు
కళికలు ప్రత్యేకకళికలు లెన్నికఁ జేసి
తత్పరార్థముల నుత్కలికలనఁగ
నేకసమాసమై యేడుదళంబులు
తుద విభక్త్యర్థంబుఁ దోఁపఁ బలుక

---

* రంగరాట్ఛందమున భీమనయుదాహరణముల కిలక్షణములఁ జెప్పె నని పైలక్షణములే వచనములో వ్రాయఁబడియున్నవి, గాని నేఁడు భీమన కృతముగా వెలయుచున్న కవిజనాశ్రయమున నుదాహరణలక్షణముగాని పై వచనముగాని లేదు. కస్తూరిరంగకవి తనఛందమున నే లక్షణగ్రంథమునుండి దీనిని వ్రాసెనో తెలియదు.

దానికెనఁ గాఁగఁ జిక్కిన దళమదుర్చి
ఫణితులొడఁ గూర్చు సార్వవిభక్తికముగఁ
గట్టికడపటిపద్యమొక్కటి రచింప
నది యుదాహరణంబగు నబ్జనాథ! (3-33).

ఇందు లక్షణమునకు లక్ష్యము లేదు.

అని లక్షణము. లక్షణసారసంగ్రహమున—

'సప్తవిభక్తులు సంబోధనంబునఁ
గలుగు నెన్మిదివిభక్తులు గ్రమమున
పతిపేరుతోఁగూడఁ బద్యమొక్కొక్కటి
రచియించి రగడమార్గమ్ము జాడ
కళికనెనిమిది దళములు తాఁ జెప్పి
తత్పూర్వమున నుత్కళికఁ జెప్పి
అదియు నేకసమాస మైయుండు దళముల
కును విభక్త్యర్థంబు గనఁగఁ జేసి
దానికినిగాగ నెన్మిదోదళముఁ గూర్చి
పద్యమొక్కటి సార్వవిభక్తికముగ
నందుఁ దుదఁ గూర్ప-నది యుదాహరణమగు
ధీర! యో యాంజనేయ! సుధీవిధేయ.

దీనికి లక్ష్యము ఆంజనేయోదాహరణము—2 ఆశ్వాసము.

అప్పకవీయమున:

సప్తవిభక్తులు సంబోధనంబునఁ
గూడ నెన్మిదివిభక్తులు గ్రమమునఁ
బతిపేరు దొరలంగఁ బద్యమొక్కటిచెప్పి
రగడభేదములు మార్గములఁ గాఁగ

కళికలు నెనిమిది దళములు గావించి
దానిలో సగము నుత్కళికఁ జేసి
యది యొక్క సమనసం బయ్యెడుదళము లె
న్మిదిఁ గూర్చి దానికిఁ దుద విభక్తి
బసులుఁ జేచి కట్టకడను పద్యమొకటి
పలుకవలయును సార్వవిభక్తికముగ
నిర్వదాఁలుపద్యములందు నిషిన ధాత్రి
నిది యుదాహరణములందు రిద్ధచరిత!

దీనికిలక్ష్యము—కృష్ణోదాహరణము.

ఈయుదాహరణమున నెనిమిది విభక్తులకు నీ క్రింది వేల్పు లధిదేవతలు—

ప్రథమకు—వాణి, విరావళి.
ద్వితీయకు—ఝట, కీర్తిమతి.
తృతీయకు—కీర్తి, సుభగ.
చతుర్థికి—దేవలాభిని, భోగమాలిని.
పంచమికి—హాణి, కళావతి.
షష్ఠికి—లలిత, కాంతిమతి.
సప్తమికి—ఘూర్ణిణి, కమల.
సంబోధనమునకు—సరసాళి, జయపతి.

అప్పకవి చెప్పిన యీయధిదేవతలలో, వీరావళి, కీర్తిమతి, సుభగ, భోగమాలిని, కళావతి, కాంతిమతి, కమల, జయపతి యనువారిని మాత్రమే రంగకవి రంగరాట్ఛందస్సునఁ బేర్కొనినాఁడు. ఈపేరులుఁ గలుగఁజెప్పినఁ దద్దేవతలు సకలశుభంబు

లొసఁగుదు రని చెప్పినాఁడు. అప్పకవి యుదాహరణములలో నాలుగు తెగలు కలవని యిట్లు చెప్పినాఁడు.

సీ. సంబుద్ధియొడలింది సప్తవిభక్తులు
పలికిన భక్తి సద్ధళి యనంగ
సంబుద్ధితోఁగూడ సప్తవిభక్తులు
పలుకనొప్పారు బద్ధళి యనంగ
సంబుద్ధితోడ విషమవిభక్తులతోడఁ
బలికినవృత్తి (గుణ) విద్ధళి యనంగఁ
గలిక లుత్కలికలు గమకింపఁ బలికిన
కావ్యంబు నుత్కళికంబు ననఁగ
నవని జాటు ప్రబంధము లందు మిగుల
నాటుకొని యొప్పుచుండు నీనాల్గుతెగలుఁ
గానఁబడు నుదాహరణముల్ గానలోల!
కామెపత్త్రీశ! వల్లవీకాము! కృష్ణ!

సద్ధళి, బద్ధళి, విద్ధళి, ఉత్కళికలు నను నీనాల్గును నుదాహరణపరిణామమునుఁ గ్రమముగ సూచించుచున్నవి. ఉదాహరణములలోఁ దొలుత దేశికవితయే వెలసిన దనుటకు నీనాలుగుదశ లెంతయేని తోడ్పడుచున్నవి. పైనాలుగింటిలో మార్గజాతిపద్యము లేదుంగుట గమనింపఁ దగినది. దేశిపదములనుండి యుత్పన్నమైన స్వత్రాగులను విభక్తి ప్రత్యయముల జేర్చి తాళలయాన్వితముగా నుదాహరణములు తొలుత రచింపఁ బడినవి. అనేక సంస్కృతచ్ఛంద ప్రస్తారముచే, మార్గజాతిపద్యము లింపు జేర్పఁబడి ప్రస్తుతము మనకు

లభించిన యుదాహరణముగాఁ బరిణమించినవి. కావున వీనినుదాహరణల ప్రాచీనరూపములని చెప్పనొప్పును.

త్రిపురాంతకోదాహరణమున నాంధ్ర లాక్షణికులు చెప్పిన పై లక్షణములన్నియుఁ గలవు. ప్రాయశః అనంతుఁడు పాల్కురికి బసవోదాహరణమును జూచి యీలక్షణము రచించి యుండవచ్చును. బసవోదాహరణమే తరువాతివారికి మాదిరి యని తలఁచుట భావ్యము.

## 14. ఉదాహరణ కావ్యవస్తువు.

ఉదాహరణములు భక్తిప్రశంసాపరములని ముందు జెప్పఁబడినవి. త్రిపురాంతకోదాహరణము శివభక్తి ప్రతిపాదకము అయినను నిందు నిరూపింపఁబడిన శివభక్తి వీరశైవమతోద్దిష్టము గాదు. వీరశైవమత ప్రవర్తకుఁడగు బసవనకుఁ ద్రిపురాంతకుఁడు చాల వెనుకవాఁడైనను నిందు బసవప్రశంసగాని సమకాలికభక్తవరుల ప్రశంసగాని గానరాదు. జంగమలింగతీర్థప్రసాదాది వీరశైవమతసాంకేతికపదజాల మిందుఁ బ్రయుక్తము గాలేదు. త్రిపురాంతకోదాహరణమునఁ బ్రస్తుతులైన భక్తులు: కన్నప్ప, సేనమరాజు, సాంఖ్యతొండఁడు, నంబి, భల్లహుఁడు, చిఱుతొండఁడు మొదలగువా రందఱు బసవనకుఁ బ్రాచీనులు. ఇందు భల్లహుఁడు (భల్లాణరాజు) దక్కఁ దక్కిన వారందఱు నఱువదిమువ్వుర భక్తులచరిత్రమునఁ గలరు. బసవనకుముందు వెలసిన భక్తిప్రధానమగు శివాద్వైతమార్గమే యిందు నిరూపింపఁబడిన దని చెప్పనొప్పును. మఱియు నిందు శివోత్కృష్టతను దెలుపు నర్ధనారీశ్వరత్వము, గంగాధారణము, మారసంహారము, దక్షాధ్వరధ్వంసము, కపాలభిక్షాట

నము, త్రిపురాసురసంహారణము మున్నగు పౌరాణికవిషయములు వీరశైవులకే గాక నందఱకుఁ బరిచితములై యున్నవియే. కావున నిందు వీరశైవముగాక భక్తిప్రధానమగు శివాద్వైతభావమే ప్రతిపాద్యము.

## 15. త్రిపురాంతకుని కవిత.

త్రిపురాంతకునికవిత దేశికవిత. దీర్ఘసాంస్కృతికసమాసభూయిష్ఠమగు మార్గరచన గాక, తెలుఁగుపలుకులతీయఁదనముఁ జవిఁజూపుచు తెనుఁగుదనము వెల్లడిసేయుచుండును. తిప్పన జాను తెనుఁగున నున్నత భావముల నెంతయేని సులభముగ నిమిడ్చియున్నాఁడు. కొంగ్రొత్తమాటలతో గొప్పయర్థముఁ గూర్పుట యందీతఁడు దిట్టర. కావున నీతని తెలుఁగుకవితయందు 'భావవీథులఁ గలసి పలుకులఁబట్టి చెప్పఁగరాని చక్కటి, యీలురేకులమంత్రకుసుమములందు వెల్గెడు చంచరీకమై' నది. 'వెన్నుఁడను నలువనను వెదుకఁదవ్వఁగువాఁడు, కూటికిఁ, కూరకు, భక్తులకూరిమి కొడుకుల నడిగెడు పెడజోగి' యైనాఁడు. అంబరాడతత్త్వములను నవలయైనతేఁడు, కొలిచినదయ బాణాసురమోసల కూరిమిఁగాచిన ఫణిహారి'యైనాఁడు. వాచవిలోనుగా నోడలి వాకిళులంబొడసూపు తీపులం ద్రోచి, శివార్చనానియతితో వెలి చూడక, లోచూపులఁ గుమారాచలనాథునందుఁ జేర్పుఁ గూర్పుఁ గూరిచినాఁడు త్రిపురాంతకుఁడు. కావునే త్రిపురాంతకోదాహరణముఁ గూర్చియు నీతనిఁ గవితనుఁ గూర్చియు విద్వాంసులీక్రిందివిధముగఁ బ్రశంసించియున్నారు.

"దీని (త్రిపురాంతకోదాహరణము) లోని యద్వైతమార్గము సులభముగాఁ దెలుఁగుపదములతోనున్నది. భక్తి

ప్రధానముగాఁ దెనుఁగునఁ బెక్కుకృతులు లేవు. దీనిశబ్దార్థ
మాధుర్యమునకు మెచ్చి చిన్నదైనను నీకృతిరత్నమును బండి
తులు కంఠాలంకారముగా వహింతు రని.........లోకమున
కిచ్చితిని." "భాషలోఁ గొన్ని యుదాహరణములే గలవు.
వానిలో నెల్ల నిది మేలైనది."

మా. రామకృష్ణకవి - ప్రథమముద్రణపీఠిక.

'త్రిపురాంతకుఁ డాంధ్రకవీశ్వరులలో నిరుపమానుఁడు.
దొరకినంతవరకుఁ బరిశీలింప నీతనికవిత యతిప్రశస్తమని
తలంపఁబడియున్నది'

ప్రభాకరశాస్త్రి : 'క్రీడాభిరామము' పీఠిక.

'త్రిపురాంతకుని త్రిపురాంతకోదాహరణము బసవో
దాహరణముకంటె తర్వాతిదైనను హృద్యతరము.'

ప్రభాకరశాస్త్రి : బసవోదాహరణ పీఠిక.

'త్రిపురాంతకోదాహరణము' మృదుమధుర శైలిగల
మంచి కావ్యము.

వంగూరి సుబ్బారావు : శతకకవులచరిత్ర.

ఇప్పటివార లేల! కవితావిషయమున గండరమిండఁడైన
శ్రీనాథుఁడే, తిప్పరాజు 'నన్నయ, భట్టు, తిక్కకవి నాయకుఁ
డన్న హుళిక్కి భాస్కరుఁడన్నను చిమ్మపూఁడి యమరాధిపుఁ
డన్నను సత్కవీశ్వరుల్ నెన్నుదుటన్ గరాంజలులు జే యని
నింతురు! రావిపాటి తిప్పన్నయు నంతవాఁడ'యని ప్రశంసించి
నాఁడు.

## 16. సంధానగ్రంథలక్షణ గ్రంథోదాహృతులు.

1 కొక్కోకమును నాంధ్రీకరించిన ఎఱ్ఱన త్రిపురాంతకు నిట్లు ప్రశంసించినాఁడు.

గీ. ముని సనత్కుమారు ధనదశమూభవు
నాశ్వినుల జయంతు నభినుతింతుఁ
బ్రథిత రావిపాటి త్రిపురాంతకాది శ్రీం
గాఢకవుల నెల్ల గారవించి. ౧ ఆ.

ఎఱ్ఱన కొక్కోకమును జగ్గన తన ప్రబంధరత్నాకరమున నుదాహరించియున్నాఁడు. ఈతఁడు క్రీ. శ. 1480 లో నున్నవాఁడు.

2. క్రీ. శ. 1500 ప్రాంతమున పెదపాటి జగ్గన తన ప్రబంధరత్నాకరమున త్రిపురాంతకోదాహరణమునుండియు నంబికాశతకమునుండియు పద్యము లుదాహరించియున్నాఁడు.

3. క్రీ. శ. 1656 సంవత్సరమున నప్పకవి తన యప్పకవీయమున నీ త్రిపురాంతకోదాహరణములోని చతుర్థవిభక్తి పద్యమును 'సరిజేసై రిపుఁడ'న్న త్రిపురాంతకునిపై చాటుధారను ననుప్రాససంబంధయతికి నుదాహరణముగను నుదాహరించియున్నాఁడు.

4. క్రీ. శ. 1680 సంవత్సర ప్రాంతమువాఁడును, ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసగ్రంథకర్తయును, లక్షణవేత్తయునగు గణపవరపు వేంకటకవి తన ప్రయోగరత్నాకరమున నంబికాశతకములోని రెండుపద్యములుదాహరించియున్నాఁడు.

5. క్రీ. శ. 1750 కవిసార్వభౌమ బిరుదాంకితుఁడును బహు ప్రబంధరచయితయునగు కూచిమంచి తిమ్మకవి తన సర్వ

లక్షణసారసంగ్రహమున రేఫ - అకార ప్రకరణమున పై 'ఆ అడి యాస' అనుపద్యము నుదాహరించి యున్నాఁడు.

పైవాని ననుసరించి చూడఁగ నిక్కవి భాషాభిజ్ఞుఁడుఁ గ్రొత్తవాఁడు గాఁడనియు, నీతని గ్రంథములు ప్రఖ్యాతములైనను లక్ష్యలక్షణగ్రంథములయం దుదాహరణములుగాఁ గొనుటచే నీకవి ప్రాచీనాంధ్రకవులలో సుప్రసిద్ధుఁ డని తెలియఁదగి యున్నది.

## 17. ఉదాహరణ గ్రంథములు

### (1) బసవోదాహరణము.

ఆంధ్రవాఙ్మయమున మన కుపలబ్ధము లగు నుదాహరణములలో బసవోదాహరణము మొదటిది. ప్రఖ్యాతలాక్షణిక శైవకవిసార్వభౌముఁడు పాల్కురికి సోమనాథుఁడు దీనిని రచియించినాఁడు. సోమనాథుఁడు తెలుఁగుననే కాక సంస్కృతమునఁ గూడ నుదాహరణమును రచియించెను. తెలుఁగు బసవోదాహరణమును 'మాఘము భారతియందు ప్రభవ సంవత్సరము' బ్రహ్మశ్రీ ప్రభాకరశాస్త్రిగారు ప్రకటించినారు. సంస్కృతమునఁ గల యుదాహరణము ముద్రితము. ఈ యుదాహరణము క్రీ. శ. 1220 ప్రాంతమునది కావచ్చును.

---

1. ఆంధ్రప్రయోగ రత్నాకరమున నీ గ్రంథము తంజావూరి పుస్తకాగారమునఁ గలదు. ఇందపూర్వ గ్రంథము లుద్ధరింపఁబడినవి. గ్రంథము ముద్రితము. ముద్రణార్హమగు నపూర్వకృతి.

2. సర్వలక్షణసారసంగ్రహము. 1898 లో మంజువాణి ముద్రాక్షరశాలలో ముద్రితము.

### (2) త్రిపురాంతకోదాహరణము.

కాలక్రమమున ద్వితీయమయ్యును, గవితాప్రకర్షయం దద్వితీయ మగునీయుదాహరణము రావిపాటి త్రిపురాంతక మహాకవి ప్రణీతము. దీనిమాతృక తంజాపూరు శరభోజీసరస్వతీ భవనగ్రంథభాండాగారమునఁ గలదు. క్రీ. శ. 1[illegible]2వ సంవత్సరమున మానవల్లి రామకృష్ణకవిగారు దీనిని ముద్రించినారు. కవిగారే తిరిగి దీనిని 19[illegible] వ సంవత్సరము ఏప్రిలునెలలో 'తిరుమల శ్రీ వేంకటేశ్వరపత్రిక' (1 సంపు 9 సం) యందుఁ బ్రకటించియున్నారు. నేనీయుదాహరణమును మూఁడవతూరి ప్రకటించినాను. ఈయుదాహరణకాలము క్రీ. శ. 1370 సంవత్సరప్రాంతము.

### (3) వేంకటేశ్వరోదాహరణము.

శ్రీతిరుపతిక్షేత్రమున సంకీర్తనాచార్యులై మహాప్రఖ్యాతిని వహించిన తాళ్లపాక నారయలోని పెదతిరుమలయ్యగారీయుదాహరణమును రచియించినారు. ఇయ్యది పైనుదాహరించిన 'తిరుమల శ్రీ వేంకటేశ్వరపత్రిక' యందు సప్తమసంచికయందు మా. రామకృష్ణకవిగారిచేఁ బ్రకటితమైనది. ఈయుదాహరణము క్రీ. శ. 1530 ప్రాంతమున రచియింపఁబడియుండును.

### (4) హనుమదుదాహరణము.

లక్షణసారసంగ్రహమును రచియించిన చిత్రకవి పెద్దన తన లక్షణగ్రంథమునం దుదాహరణలక్షణమును జెప్పి దానికి లక్ష్యముగా హనుమంతునిపరముగా నొకయుదాహరణమును రచియించియున్నాఁడు. ఈగ్రంథ మాంధ్రసాహిత్యపరిషత్పత్రిక

యందు ప్రకటితమైనది. ఈయుదాహరణకాలము క్రీ. శ. 1560 ప్రాంతము.

(5) శ్రీకృష్ణోదాహరణము.

అప్పకవి తన 'అప్పకవీయము' (4 ఆ) నుదాహరణ మనును జెప్పుచు లక్ష్యముగా శ్రీకృష్ణునిపరముగా నీయుదాహరణము రచియించియున్నాఁడు. అప్పకవికాలము సునిశ్చితమైనదే. ఈయుదాహరణము క్రీ. శ. 1656 సంవత్సరమున రచియింపఁబడినది.

(6) శేషార్యోదాహరణము.

శ్రీవల్లందిగళు వంశజుఁడైన శేషార్యుని ప్రశస్తిని వర్ణించుచు, బాలకవి యనంతయ్య రచియించినది. ఇది యముద్రితము. ఈశేషార్యుఁడు మధురనాయకుఁడగు విజయరంగచొక్కనాథుని యమాత్యుఁడగుటచేఁ గవియు నాకాలపువాఁడే విజయరంగచొక్కనాథుఁడు క్రీ. శ. 1704 మొదలు క్రీ. శ. 1720 వఱకుఁ బరిపాలించినవాఁడు శేషోదాహరణము క్రీ. శ. 1720 సంవత్సర ప్రాంతముల రచియింపఁబడి యుండవచ్చును.

(7) చిక్కదేవరాయోదాహరణము.

సంస్కృతము - అముద్రితము మైసూరి ప్రభువగు చిక్కదేవరాయుని ప్రశస్తిగూర్చి తెలుపునది.

(8) విశ్వేశ్వరోదాహరణము.

ఏనుఁగు లక్ష్మణకవి విశ్వేశ్వరోదాహరణము రచియించినట్లాతని భర్తృహరి-యాంధ్రీకరణమువలనఁ దెలియుచున్నది కాని యీయుదాహరణము లభ్యము కాలేదు. దీని రచనాకాలము క్రీ. శ. 1780 ప్రాంతము.

(9) ముఖలింగేశ్వరోదాహరణము.

కళింగదేశాంతర్గత జంగమారామవాస్తవ్యుఁడు మద్వ వేంకటకవి ముఖలింగేశ్వరునిపేర నుదాహరణము రచియించి నాఁడు. ఇయ్యది క్రీ. శ. 1896 లో ముద్రింపఁబడినది. శుద్ధాంధ్ర నిరోష్ఠ్యనిర్వచనముగ 'కుశచరిత్రము'ను రచియించుటవలనను నాగ్రంథ సుముద్రితగ్రంథచింతామణియందుఁ ప్రకటింపఁ బడుటచేతను నీతఁడు ప్రసిద్ధిఁ జెందెను. ఇతని కాలము (1863-1901).

---

# పరిశిష్టము.

త్రిపురాంతకోదాహరణమున, తరువాతి యుదాహరణములందున్న, 'అంకితాంకపద్యము' లేదు. ఈ యంకితాంక పద్యము వేంకటేశ్వరోదాహరణమున తొలుత గన్పట్టుచున్నది.

ఉ. ఆకవిదారకంబుగ నుదాహరణంబు రచించె భక్తివి
స్తారత తాళ్లపాక పురశాసనుఁడన్న యతిమ్మయార్యుఁ డిం
పారఁగఁ జక్రనందకగదాంబుజధారికి, శ్రీవధూ మనో
హారికి, వేంకటాచలవిహారికి శౌరికి నంకితంబుగన్.

పై యుదాహరణముల వెనుక వెలసిన యుదాహరణము లన్నింటిలో నిది నియతముగ నున్నను మనకు తొలుతలభ్య మైన పాల్కురికి సోమనాథుని తెనుఁగు బసవోదాహరణములో నీయంకితాంకపద్యము కన్పట్టుటలేదు. కావుననే త్రిపురాంతకో దాహరణమున లేదు. సోమనాథుని సంస్కృతబసవోదాహరణ ములో మాత్ర మీయంకితాంకపద్యము కలదు.

ఆర్యా. శ్రీ బసవరాజగుణరుణి
ఖచితమ్ జయతాత్ సువర్ణమేతత్
సోమసుకవినారచితమ్
హృదయాభరణమ్ పదా ముదాహరణమ్

తెలుగులాక్షణికు లుదాహరణమును గూర్చి చెప్పిన లక్షణములలో 'సంకీర్ణాంకపద్యము' లేదు. దీనికి కారణము, త్రిపురాంతకోదాహరణము తరువాత నుదాహరణము రచించినకవులు సంస్కృతములో నున్న యుదాహరణలక్షణము ననుసరించుటయే యని చెప్పవచ్చును. త్రిపురాంతకుని బాల్యమున మహాప్రసిద్ధుడగు విద్యానాథుడు, ప్రతాపరుద్రీయమున నీక్రిందివిధమున వ్రాసిన యుదాహరణలక్షణమునకు కుమారస్వామి సోమయాజి వ్యాఖ్యాన మిట్లు కావించియున్నాడు.

మూలము. అథ క్షుద్రప్రబంధా నిరూప్యంతే:—
యేన కేనాపి తాళేన గద్యపద్యసమన్వితమ్,
జయత్యుపక్రమం మాలిన్యాదిప్రాసవిచిత్రితమ్
తదుదాహరణం నామ విభక్త్యష్టకసంయుతమ్.

యత్రాదౌ జయత్యుపక్రమం మాలిన్యాదివృత్తం రమ్యం పద్యం నిబధ్యతే అనంతరమపి చేత్యుపక్రమాణి అష్టవాక్యాని సప్రాసాని సతాళాని ప్రతివిభక్తి నిబధ్యంతే అనంతరం విభక్త్యాభాసాః తదుదాహరణమ్.

వ్యాఖ్యా. అథ క్షుద్రప్రబంధేషూదాహరణస్య లక్షణమాహ. యేనకేనేతి తాళేన చంచత్పుటాదినా గద్యైః క్రమేణ కలికోత్కలికాపరపర్యాయై విభక్తి. విభక్త్యాభాసాంకితై ర్వా

కైశ్యః పద్యం ప్రతివాక్యమాదౌ తత్తద్వాక్య సమాన విభక్తి నాయకనామాంకితైః శ్లోకైశ్చ సమన్వితమ్. మాలినీనామ వృత్త విశేషః 'ననమయయయుతేయం మాలినీ భోగిలోకై'రితి లక్షణాత్ అత్ర లక్షణస్య న్యూనత్వాదవ్యర్థమానపదానాంచ సంకీర్ణత్వాదుభయం వారయన్వ్యాచష్టే. యత్వేత్యాదినా అత్ర సంబోధన విభక్తిరష్ట మీ ప్రబంధాంతే సర్వవిభక్త్యంకితో నవమశ్లోకశ్చేత్యాది విశేషాణాం సాక్షీశ్లోకాస్సాహిత్య చింతామణౌ ద్రష్టవ్యాః అంతే కవిప్రబంధానామాంకితంపద్య విశేషం కుర్యాత్. తదుక్తం "అంతేఽనుష్టుభమార్యాం వాకవి కృత్యాఖ్యయాఽన్వితాం కుర్యాచ్చాటుప్రబంధానామయం సాధారణో విధిః"

(ప్రతాపరుద్రీయము కావ్యప్రకరణము పుట 83 వావిళ్ల ముద్రణాలయము 1927.)

పై వ్యాఖ్యనుబట్టి 'అంకితాంకపద్యము' తొలుత నుదాహరణముల లేదనియు, సంస్కృతోదాహరణములలో నున్నచో, దానిని విద్యానాథుఁడు లక్షణముగా నిచ్చియుండు ననియు, తనకు ముందు తెలుఁగు దేశమున సంస్కృతముననే వెలసిన పాల్కురికి సోమనాథుని బసవోదాహరణము నాతఁడు చూచియుండలేదనియు, వ్యాఖ్యాత కుమారస్వామి సోమయాజి, యీవిషయమును విశేషించి తెలిపెననియుఁ దెలియనగుచున్నది. వ్యాఖ్యాత యుదాహరించిన సాహిత్యచింతామణి తెనుఁగు దేశము నేలిన రెడ్డిరాజు, శ్రీనాథమహాకవి కాశ్రయదాత, సర్వజ్ఞుఁడు నగు పెదకోమటి వేమభూపాలుఁడు రచించిన యలంకారశాస్త్రము. వేమారెడ్డి తెనుఁగు దేశీయుఁడు కావున,

దేశియందున్న ప్రత్యేకవిశిష్టతను నాగ్రంథమున నెంతయో ప్రతిపాదించియున్నాఁడు. కావుననే కేవల సాంస్కృతికాలంకారదృష్టితో విద్యానాథుఁడు ప్రపంచించినదానిని విశేషములతో కూడ దేశీయపద్ధతుల గమనించి, పెదకోమటి వేముఁడు దీనిని వివరించినాఁడు. కోమటి వేమభూపాలుని లక్షణమునకు సోమనాథుని యుదాహరణము[1] లక్ష్యమై యుండనోపును. కాగా నీయంకితాంకపద్య ముదాహరణములలో పై సంస్కృతలక్షణము ననుసరించి తరువాతివా రనుసరించరని చెప్పనగును.

లఘుకావ్యమే యయ్యు త్రిపురాంతకోదాహరణము చాల వ్యాప్తిలోనుండె ననుట కీక్రిందియనుకరణములు ప్రమాణములు కాఁగలవు.

చ కమలజుతోరపుంబునుకకంచము, పాదసరోరుహార్చనా
కమలము వారిజోదరుని కన్ను కరంబున కాదిభోగి భో
గము రవణంబు, చంద్రుఁడు శిఖాకుసుమంబటె, యెవ్వరీడు మా
రమణునకుం గుమారగిరిరాజనివాసున కన్య దైవముల్.

(షష్ఠీవిభక్తి పద్యము)

వీరభద్రవిజయమున బమ్మెరపోతన మహాకవి

ఉ. మేరువు వింటికమ్మి యటె, మేదిని తేరటె, సూర్యచంద్రులిం
పారఁగ బండికండ్లటె యనంతుఁడు నారటె బ్రహ్మవిష్ణువుల్
సారథియుం శరంబులటె సామచయంబటె గుఱ్ఱముల్ మనో
జారికి నెవ్వరీడు త్రిపురాసురవైరికి నన్యదైవముల్ (4-34)

---

1. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక స్వభాను సం. 32 సంచిక. 3-౪ సంస్కర్త చే ప్రకటితము.

చంద్రతారావళియందు:- చంద్రా! రోహిణీవల్లభా అను మకుటమును పిల్లలమఱ్ఱి పినవీరన శృంగారశాకుంతలములో చంద్రోపాలంభమున నందుకొన్నాఁడు

కుమారభారతి బిరుదమును ధరించిన తెనాలి రామలింగకవి (వైష్ణవుఁడైన వెనుక రామకృష్ణకవి) తన యుద్భటారాధ్య చరిత్రములో త్రిపురాంతకోదాహరణమున కళిక పాదములనే నొక రగడయందు కూర్చినాఁడు.

ప్రథమావిభక్తి కళిక.

ఆఖురేపుల మంత్రకుసుమమునందు వెలిఁగెడిచంచరీకము త్రి. ఉ.

ఆఖుదళంబుల మంత్రకుసుమమున నలిరాజము క్రియ నలిఁ గ్రీడించితి

ఉ. చ. 3. ఆ. 287. రగడ.

కొలిచినదయ బాణాసురు మోసలకూరిమిఁ గాచిన ఫణిహారికి నై

చతుర్థీవిభక్తికళిక.

కడు బ్రియమున బాణాసురు మోసలఁ గాచుటకును నిరవధి కృపసలిపితి.

ఉ. చ. 3. ఆ. 287. రగడ.

శ్రీనాథుఁడు కూచిరాజు ఎఱ్ఱనయేగాక మఱియెందఱో కవులును త్రిపురాంతకుని నుతించిరి

ఆంధ్రకవి రామయ విష్ణుకాంచీమహాత్మ్యమున
రసికజనపద్మ దిననాథు రంగనాథు,
ప్రకటకృతికర్మనిస్తంద్రు భాస్కరేంద్రు,

---

ఉద్భటారాధ్యచరిత్రము - మద్రాసువావిళ్ల.. ముక్త్యాలసరస్వతిపత్రికయందు ప్రకటితము - బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి పాదుల ప్రశస్తపీఠిక చే నలంకృతము- 1924.

అమితరసభావు శ్రీత్రిపురారిదేవు;
సూక్తి తిమిరధాము నాచనసోముఁ దలఁతు"

ప్రబంధరత్నావళి. 422

రామరాజు రంగప్పరాజు సాంబోపాఖ్యానమున
'త్రిపురాంతకుని వచస్థేమంబు నొకకొంత'
కొఱల శ్రీనాధోక్తి కొంత నిగుడ
మఱియుఁ దక్కనసుకవుల ... ... (1-57)

పదములు - అర్థములు.

1. ఉత్తులు - ప్రకృతి - యుక్తులు - ఉపాయములు
"బత్తులుత్తు లొరసి యొరసిపట్టు."
2. ఒడగినాకిళులు=ఇంద్రియములు
"వాచవిలోనుగానొడళినాకిళులం
బొడసూపుతీపులన్." ద్రోని,
3. చిత్తు=చిత్-తత్స్వరూపము-జ్ఞానము
"సత్తుచిత్తుదానయైన సత్యనిత్యబీజమునకు"
4. పెన్నింట - జలపూరము
......తపముల పంట
పరసుఖవార్ధి పెన్నింట
పన్నింటలఁ గూర్పు కామము నిబ్బరమైనమదంబుహరి-ఉ.
5 పోటుముట్టు-యుద్ధసాధనము-త్రిశూలము
మూఁడుమోముల పోటుముట్టు బట్టెదుశూర!
పోటుముట్టు - (ఆంధ్రభాషాభూషణము)
మూఁడు మొనల పోటుముట్టుబట్టు -
(జక్కన విక్రమార్కచరిత్ర 2-192)

6. మందటలాడు=తగవులాడు

"ముందటం బాలు క్రోడము నేసి మందటలాడి
మార్కొనంగవచ్చిన క్రీడి"
"పాడియడుగుచు మందటలాడియాడి"
(కేతన-దశకుమారచరిత్ర 5-64)

"పాడుచు నాడుచు మందటలాడుచు నొండొరుల దాఁకు"
(భాగవతము దశమస్కందము
పూర్వభాగము 606 పద్యము)

7. రవణము=భూషణము

"అది భోగిభోగము రవణంబు"
"పచ్చలుచెక్కినట్టి రవణంబులు వీరకుమార కోటికిన్"
రమణశబ్దభవము-రాణరూపాంతరము. ... ... (క్రీ.రా.)

8. సత్తు-సత్-తత్సమరూపము

"సత్తుచిత్తుదానయైన సత్యనిత్యబీజమునకు"
సత్యమునకు సత్త్వమునకుఁ దద్భవము సత్తు
ఇచట వేదాంతపరమైన బ్రహ్మపదార్థమున కర్థము.

9. రొప్ప=బండితోలు

"నలువ నిగమహయలరొప్ప"
బండిరొప్పెడు పని బంచినాఁడు
(శ్రీపర్వతపురాణము)

10. సన్నిధిసేయు=దర్శనమిచ్చు

"సన్నిధిచేసిన చూడగంటినే నామదిలోఁ
గుమారగిరినాథుని" (భార. విరా. 1-12)

11. దువ్వాలువు=దుప్పటము - వలువశబ్దము కారాంతము 'వలువు' అని ప్రాచీనకాలమున వాడిక

"వలునెడలం బయల్వడియె వల్గకుచంబులు."

(భారతము ఆదిపర్వము 4-43)

"ఎఱిగెఱెంగి నావలు విడియేల కట్టుకొనవచ్చు"

(భాగవతము 9-516.)

# త్రిపురాంతకోదాహరణము.

## ప్రథమావిభక్తి.

ఉ. శ్రీనగచక్రవర్తితుదిశ్శృంగము చూచెదమంచు నేఁటికిం
బోననిశంబు నుండునిదె![1] పుట్టువుఁ జావును లేనిమందు నా
చేననుచుం బతాక యనుచేఁ దరుణాచల మెక్కి[2] చీఱుఁ బం
చాననుఁ డిందుమౌళి త్రిపురాంతకదేవుఁడు భక్తలోకమున్.

### కళిక-వృషభగతిరగడ-త్రిపుటతాళము.

మఱియును సజ్జనభక్తగృహముల - మరగి తిరిగెడికామధేనువు
కఱద లెఱుఁగక వేఁడుదీనులఁ - గదియుజంగమరత్నసానువు
శైలజాముఖచంద్రరోచుల - చవులఁ దవిలెడునవచకోరము
వేలుపుందపసులతలంపున - వెల్లికొల్పెడు నమృతపూరము
[3] దేవతలు మువ్వురకు నవ్వలి - దెస వెలుంగుచునుండు నెక్కటి
భావవీథులఁ గలసి పలుకులఁ - బట్టి చెప్పఁగరాని చక్కటి
ఆఱురేకులమంత్రకుసుమము - నందు వెలిఁగెడు చంచరీకము
వేఱుసేయక యోగిజనములు - వెదకిపొందెడు[4] నూర్ధ్వలోకము

---

1. మానవులు - ముద్రితములు.
2. చేరు - వ్రాఁతపుస్తకము.
3. దేవతలకు - ముద్రితములు.
4. పొందెడి - ముద్రితములు.

## ఉత్కళిక.

అడుగుఁదమ్ములఁ జొప్పు వసి గని
యదరి శునకాకృతులు గైకొని
మీఱిచదువులు దవుల ముందటఁ
బాఱుక్రీడము నేసి మందట
లాడి తను మార్కొనఁగవచ్చిన
క్రీడి కోరినవరము లిచ్చిన
యాటవికకులసార్వభౌముఁడు
జూట భాస్వత్తుహిన ధాముఁడు.

## పద్యవివరణము.

భారతవర్షమున ద్వాదశజ్యోతిర్లింగములయందు[1] తెలుఁగు దేశమునఁ జిరప్రఖ్యాతిఁ గన్న శ్రీశైలమునకు నాలుగు దెసలను నాలుగు వాకిళ్లు గలవు. వానికిఁ దూర్పున త్రిపురాంతకము; పడమట బ్రహ్మేశ్వరము (అలంపురి); ఉత్తరమున మాహేశ్వరము; దక్షిణమున సిద్ధవటము నని పేరులు. ఈనాలుగు

---

1. ద్వాదశజ్యోతిర్లింగములు:—(1) సౌరాష్ట్రమున సోమనాథుఁడు, (2) శ్రీశైలమున మల్లికార్జునుఁడు, (3) ఉజ్జయిని మహాకాళుఁడు, (4) అమరేశ్వరము ఓంకారేశ్వరుఁడు, (5) వారేల్యమున వైద్యనాథుఁడు, (6) దారుకనాగనాథుఁడు, (7) వారణాసి విశ్వేశ్వరుఁడు, (8) దాక్షారామము భీమేశ్వరుఁడు, (9) రామేశ్వరమున రామలింగేశ్వరుఁడు, (10) హిమాలయమున కేదారేశుఁడు, (11) నాసిక త్ర్యంబకేశ్వరుఁడు, (12) ఏలాపురి ధిషణేశ్వరుఁడు.

ఈద్వాదశజ్యోతిర్లింగములఁ గూర్చిన ప్రశంస
భారతి, రక్తాక్షి, ఫాల్గునము, 'మార్చి 1925' లోఁ గనఁదగును.

వాకిళ్లకు, త్రిపురాంతకుఁడు, బ్రహ్మేశ్వరుఁడు, మాహేశ్వరుఁడు, సిద్ధవటేశ్వరుఁడు ననువా రధినేతలు. అందు, తూర్పు వాకిలి త్రిపురాంతకమున కధినాథుఁ డగు త్రిపురాంతకదేవునిపై నీయుదాహరణము త్రిపురాంతరుమహాకవిచే రచియింపఁబడినది. కావున నీగ్రంథమునకుఁ ద్రిపురాంతకోదాహరణ మనుపేరు గలిగినది.

తరుణాచల మనఁ గుమారగిరి. త్రిపురాంతకమునొద్ద పర్వతభాగమునకుఁ గుమారగిరి యనుపేరు. ఈకుమారాద్రికిఁ దూర్పుదెసను రెంటూల మల్లినాథుఁ డనుభక్తుఁడు పండ్రెండవ శతాబ్దమున సోపానములఁ గట్టించెను. ఈతఁడు పాల్కురికి సోమనాథుని సమకాలికుఁడు. (చూ. బసవపురాణావతారిక - పుట 3).

పద్యమునఁ బంచాననశబ్దమును కవి బహుళార్థస్ఫోరకముగ నుపయోగించినాఁడు. పైని వివరించిన నాలుగు వాకిండ్ల యధినేతలును, నాదిశృంగ మగు శ్రీశైలాధీశ్వరుఁడు మల్లికార్జునస్వయంభూలింగమూర్తియు నీశ్వరుని పంచముఖములనుండి యుద్భవించినట్లు పండితారాధ్యచరిత్రమున నిట్లు గలదు:—

అద్భుతలీల నయ్యైస్థానములు స
ముద్భవం బయ్యె లింగోపకంఠమున
నొలసి తదీయసద్యోజాతవదన
మలరి బ్రహ్మేశ్వరం బనఁ బశ్చిమమున
వామదేవాంచితవక్త్రంబు బరఁగెఁ
దా మహేశ్వర మనఁ దగ నుత్తరమున
గురుదక్షిణమున నఘోరవక్త్రమున

వరలె జ్యోతిస్సిద్ధవటనాథుఁ డనఁగ
రమణఁ దత్పురుషవక్త్రము మహామహిమ
నమరెఁ దూర్పున త్రిపురాంతకుఁ డనఁగఁ
దనరె నీశాన్యవక్త్రంబు నూర్ధ్వంబు
నను మల్లికార్జుననామంబు దాల్చి.

మఱియుఁ బంచాననుఁడు చీఁకు నసుటలో, తన కెదురుగ నున్న భక్తులనే కాక నలుదిక్కులయందును నాపై నున్న వారినిఁ గూడ విడువక పిలుచు నర్థస్వారస్యము గలుగుచున్నది.

హిమాలయము శ్రీశైలము మొదలగు శబ్దము లహామర్థకము లైనను మహదర్థకములుగ వాడుట సంప్రదాయసిద్ధమే. పాల్కురికి సోమనాథుఁడు శ్రీశైలమును నగముల లోఁ బురుషనగముగా నిట్లు సరసముగ వర్ణించినాఁడు.

'నగము లన్నియుఁ బెంటినగము లీనగము
పొగడఁ బున్నగమును బున్నాగములును'

మఱియు 'శ్రీనగచక్రవర్తి' యని పలుచోట్ల పండితారాధ్యచరిత్రమునఁ గలదు. కావుననే త్రిపురాంతకుఁడు శ్రీనగచక్రవర్తి యని మొదలిడినాఁడు. దేవాలయమున నాయాదైవతచిహ్నము లగుపతాక లుండుటయు, పతాకలు రాజలాంఛనము గావునను నిందు చక్రవర్తిపదము సార్థకమే యగుచున్నది.

## కళికవివరణము.

ఆఱురేకులమంత్రకుసుమము. ఓంకారముతోఁ గూడిన

పంచాక్షరికి షడక్షరి యని పేరు * మంత్రకుసుమమున బీజాక్షరములు రేకులుగా మంత్రాధిదైవతమును దుమ్మెదగాఁ బోల్చు భావము త్రిపురాంతక మహాకవికిఁ బూర్వమునుండియుఁ బ్రచారములో నున్న 'తుమ్మెద'పదములలోఁ గలదు.

తుమ్మెదపదములు పండ్రెండవశతాబ్దమునఁ బ్రచారములో నున్నట్లు పండితారాధ్యచరిత్రమువలనఁ దెలియవచ్చును.

"పదములు తుమ్మెదపదము ల్ప్రభాత
పదములు పర్వతపదము లానంద
పదములు శంకరపదముల్ నివాళి
పదములు హాలేశుపదములు గొబ్బి
పదములు వెన్నెలలపదములు"

అది-ఆఱు-రేకుల-పువ్వు-తుమ్మెదా-అది మీఱినవాసనె తుమ్మెదా-అనునది. పండితారాధ్యచరిత-నాదప్రకరణము 173 పుట.

---

*ఓంకారపూర్వో మంత్రోఽయం పంచాక్షరమయం పరః
శైవాగమేషు వేదేషు షడక్షర ఇతి స్మృతః. సిద్ధాంతశిఖామణి.

ప్రణుతింపఁ బంచాక్షరములకు మొదలఁ
బ్రణవమొంద షడక్షరంబు నాఁ బరఁగు. దీక్షాబోధ-ద్వితీయాశ్వాసము.

ప్రథమముద్రణమునందు, ఆఱురేకులమంత్ర మన మూలాధార స్వాధిష్ఠాన మణిపూర కానాహత శుద్ధ సహస్రార బ్రహ్మరంధ్రము లని వ్రాయఁబడి ద్వితీయముద్రణమున నాఱురేకులమంత్ర మనఁ బ్రణవాక్షరపూర్వక మగు పంచాక్షరి యని వ్రాయఁబడియున్నది. ఇందు తొలియర్థము తాంత్రికసంప్రదాయము. రెండవది శైవసంప్రదాయము. ఈసంప్రదాయములు రెండును సోమనాథభాష్యమునను, వీరశైవాష్టావరణప్రమాణాష్టకాభరణమునను వివరింపఁబడి యున్నవి. శైవాగమములు శివలింగ మీషడక్షరీమంత్రరూప మని తెలుపుచున్నవి.

## ఉత్కళికావివరణము.

ఉత్కళికయందు సుప్రసిద్ధమగు కిరాతార్జునకథ వర్ణితము. పరమేశ్వరుఁ డర్జునునకు పాశుపతము నొసఁగు సందర్భమునఁ గిరాతవేషమును దాల్చుటయు నందు, వేదములు శునకములగుటయు శైవగ్రంథములయందు పలుచోట్ల వర్ణింపఁబడినది. పండితారాధ్యచరిత్రమున నీయవతారలీల పదునైదవదిగా వర్ణింపఁబడినది. ఈలీలలు సాంఖ్యమతానుసారముగా నిరువదియైదు తత్త్వముల కిరువదియైదు లీలలు పాల్కురికి సోమనాథుఁడు వివరించినాఁడు. నిశ్శంక కొమ్మన శివలీలావిలాసమున, శైవసంప్రదాయానుసరణముగ ముప్పదియాఱు తత్త్వములకు ముప్పదియాఱు లీలలు వివరించినాఁడు. కేవల రౌద్రాకారుఁడును, సంహారమూర్తియు నగురుద్రుని దయామయత్త్వమును విశదీకరించు నీ లీల ప్రాచీనకాలమునుండియుఁ గవులమనంబులు చూఱఁగొని శైవభక్తి స్థిరీకరణమునకుఁ గారణమైనది. భారవి క్రీ. శ. 6 వ శతాబ్దమున కిరాతార్జునకథ రచియించుట ప్రసిద్ధమే.

## ద్వితీయావిభక్తి.

ఉ. పామును-హారమున్, నెలయుఁ(బాపటసేసయు[1] నేఱు మల్లికా
దామము, తోలుదువ్వలువు(బట్టపుభూతియుఁ జందనంబు మై
సామునఁ జాల నందముగ(పస్నిధి సేసినఁ బాడఁగంటి నే
నామదిలోఁ గుమారగిరినాథుని శైలసుతాసనాథునిన్.

కళిక - విజయభద్రగడ - జంపెతాళము.

మఱియుం వేలుపుటేటి - మాళి నాఁగినవాని
నెఱయఁ గన్నుప నోటి - నీటఁ దోఁగినవానిఁ

---

1. బొట్టు - ముద్రితపుస్తకము.

బొలఁతితో నొక్కొ-దలఁ - బొత్తుఁగూడినవానిఁ
దలఁకి సేసమరాజు - దాడి కోడినవాని
శాఖ్యతోండని రాల - జడికి నోర్చినవాని
సౌఖ్యతరసాయుజ్య - సరణిఁ దీర్చినవాని
వెన్నెలలఁ బురణించు - వెలఁదినవ్వులవాని
వెన్నునకు నలువకును - వెదక దవ్వగువాని,

ఉత్కళిక.

చిగురుఁగైదువు చెలికి
మగలసిగ్గులు నలికి
సతులఁ బాటులుపఱచి
యతుల వ్రతములు చెఱచి
అలలు చిలుకలు బండు
లెలయఁ గొలువగ నుండు
మరు జయించినవానిఁ
గరుణ మించినవాని.

## పద్యవివరణము.

అచ్చులోనున్న 'బొట్టు' అనుపాఠముకన్న 'సేస' యను పాఠము శ్రేష్ఠము. జగ్గన ప్రబంధరత్నాకరమున నుదాహరించిన యీపద్యమున 'సేస' యనుపాఠమే గ్రహించియున్నాఁడు. చంద్రుఁడీశ్వరునికి శిరోభూషణమైనను, నర్ధనారీశ్వరుఁడైనపుడు చంద్రఖండము 'సేస' వలె సీమంతమున నుండును. అర్ధనారీశ్వరత్వ మిందు ధ్వనితము.

దువ్వలువు- రెండువలువలు- వలువు ప్రాచీనరూపము. (దుగ+వలువు)-

## కళికవివరణము.

1. ఈశ్వరుఁడు గంగను ధరించినకథ శివపురాణప్రసిద్ధమే
2 కన్నప్ప యనుశివభక్తుఁడు తనపుక్కిటనీటితో శివు నభిషే కించి సాయుజ్యమునుఁ బొందినకథ బసవపురాణమునఁ గలదు ధూర్జటి శ్రీకాళహస్తిమాహాత్మ్యకథలోఁ గూడఁ గలదు.
(తృ ఆ.)
3. నేనమరాజు- చేరమచక్రవర్తి... మహాగోదుఁ డనినామాం తరము- శైవభక్తుఁడు.
4. సాఖ్యతొండడు- ఈభక్తుఁడు శాక్యుఁ డగుటచే సాక్య తొండఁ డనియుండుట సరి. బసవపురాణమున సాంఖ్య తొండఁ డని కలదు. ఈతని కథయందు షష్ఠాశ్వాసమున వర్ణితము. త్రిపురాంతకుఁడు ప్రాసస్థానమున నీరచము సౌఖ్య యనుదానితోఁ గుదురుపఱచుటచే నిదియే సాధురూప ముగా నెన్నఁదగినది.

ఉత్కళికయందు మారసంహారము వర్ణితము

## తృతీయావిభక్తి.

ఉ. వాలి నటించు ముక్తినరశవర్ణినిపయ్యెదకొంగు చాడ్పునం గ్రాలునిజాంకపుంబడగ ఁగన్నులఁ జూచిన జాలు, నిమ్నగా

---

బౌద్ధదంపతులకుఁ బుట్టిన శాఖ్యతొండఁడు శివభక్తిపరుఁడై శివాలయ మున ముప్పూటలు మూఁడు ఱాలతో శివపూజ సేయుచుండ నొకతఱి నేడు రోజులు వర్షము గురియుటచే నాలయమునకుఁ బో వీలులేక నుపవాసముండి యేడవనాఁడు నాఁడొకఱాయియుఁ దొరకకపోవుటచే నొక పెద్దబండ నెత్తి, శివునిఁ బూజించెను. శివుఁడు ప్రత్యక్షమై సాయుజ్య మిచ్చెను.

స్ఫాలితమాళి చేతఁ, బురభంజను చేతఁ గుమారపర్వతం
బేలెడు రాజు చేత ఫలియించు జనావళికోరు కోరుకుల్.

కళిక-(హాయప్రచారము లేక తురగవల్గనరగడ)రూపక తాళము

మఱియు వట్టిమ్రాని మొదల - మరగి యున్న గురుని చేత
గోఱిలి తాపసులకు నెఱుకఁ - గొలుపు జటిలవరుని చేత
నంబి పసుప కుంటెనలకు - నడచిన యొదకాని చేత
నంబరానితత్త్వములకు - నవలయైన జేని చేత
జల్లహూనిపఘాటి కాస - పడిన గుండగీని చేత
[1]నల్లయులక యేలురాజు-ననుఁగుసంగతిని చేత
భూతిబూయుం మానవులకుఁ - బుట్టుమాన్పు వైద్యు చేతఁ
ప్రతి ఘాతపురుకనోర - భిక్షసేయు నాద్యు చేత.

ఉత్కళిక.

ఇల రక్షింబులీల నొప్ప
నలువ నిగమహారుల రొప్పఁ
బొసఁగఁ బాపనాశిఁ బట్టి
పసిఁడికొండ నెక్కఁ బెట్టి
జలధి నిద్రవోవు శరము
దొడఁగి నేలఁ గూలఁ బురము
లేసియున్న జోదు చేత
దాసవరకణాదు చేత.

పద్యవివరణము.

ఇందు, దేవాలయము పైపతాక ముక్తికాంతపైట
తోఁ బోల్పఁబడినది.

కళికవివరణము.

1. వటవృక్షము దక్షిణామూర్తికి స్థానము. దక్షిణామూర్తిగా

శివుఁ డవతరించుట శివుని యిరువదినాల్గవలీల.

దక్షిణామూర్తివై ధరమునీంద్రులను
శిక్షించి ప్రోచినశివుడ రక్షించు సోమనాథ స్తవము.
మునుల శ్రీదక్షిణామూర్తి వేషంబు
నను బ్రోచు టిరువదినాల్గవలీల
పండితారాధ్యచరిత్రము.

ఒక్కొక్క దేవత కొక్కొక్కవృక్షము ప్రియ మగుట భారతీయ సంప్రదాయము. శ్రీమహావిష్ణువు ప్రళయకాలమున మఱ్ఱియాకుపై విశ్రమించును. కావుననే 'వటపత్రశాయి' నామము ధరించినాఁడు. బిల్వము శివునకుఁ బ్రీతి.

కళికవివరణము.

2. ఇందు శివునిసర్వజ్ఞత్వము వర్ణితము.
3. నంబి=సుందరమూర్తినయనారు- అరవమునఁ గొప్పకవి. తెలుఁగున నొడయనంబివిలాస మీతనిచరిత్రము దెలుపును. బరవ, సంకిలి యనుపేరులుగల యిరువురుభార్యల నీతనికి శివుడు దూత్యము నడిపి పెండ్లిసేయించెను.
4. బల్లహుఁడు=భల్లాణరాజు- ఈకథ తెనుఁగువారికిఁ బ్రేమపాత్రమైనది.
5. అల్లకయేలురాజు- అలకాధిపతి కుబేరుఁడు.

ఉత్కళికవివరణము.

ఇందు త్రిపురాసుర సంహారము వర్ణితము:—

చూడుఁడు-

సీ. ఖండఖండములుగఁ గదిసిన తేరికి
భంగంపుటిరుసు పాసంగఁగూర్చి

విజ్జోడుపడి నిచ్చవినువీథిఁ దిరిగెడు
చక్రంబు లోనఁగూడ సంఘటించి
తలకొన్న భీతి కొంకవలపడ బహుముఖ
భ్రాంతసారథి నేరుపరిగ నిలిపి
పలుకపదక్రమంబుల నలుజాడల
బోయెడు గుఱ్ఱముల్ పూనుకొలిపి
కుంటివింటనుఁ బలువంకల గోలఁ దొడిగి
విషమలక్ష్యంబు లేగటి వేసి తయ్య
వేల్పు లెవ్వరు నీసాటి విజయవాటి
మల్లికార్జునలింగ ! ఉమాప్రసంగ.

(బొడ్డపాటి కొండయ)

## చతుర్థివిభక్తి.

ఉ. ఆఱడియాస నీరసధ రాధిపలోకము లిండ్లు వాకిళుల్
దూఱుట మాని శ్రీనగము తూఱుపు వాకిలిఁ జొచ్చిపాపముల్
నీఱుగఁ జేసి గంధవతి నీటనుఁ గ్రుంకి మనంబులోని చి
చ్చాఱఁగఁ జేయుటొప్పు త్రిపురాంతక దేవునకై నమస్కృతుల్.

కళిక-వృషభగతిరగడ. త్రిపుటతాళము.

మఱియును మెఱయఁగ దిశలనియెడు నును-మడుఁగులుగట్టిన శృంగారికినై
కొఱలినదయ బాణాసురు మోసల - కూరిమిఁ గాచిన ఫణిహారికినై
మేలపుఁజదువులు చదివిన విని మది - మెచ్చినలక్ష్మీపతి బావకునై

---

ఈపద్య మప్పకవీయమున నుదాహరింపఁ బడియున్నది. ద్వి. ఆ. 214 పద్యము, గంధవతి త్రిపురాంతకమునందలి తీర్థము.

యీలువుఁగ॥ సద్భక్తులు ముక్తికి - నేఁగెడు చేరువపెనుత్రోవకునై
కూటికిఁ గూరకు భక్తులఁగూరిమి - కొడుకుల నడిగెడు వెడజోగికినై
విటికి బోటికి జడలును నొడలును - నిచ్చినజగదేక త్యాగికినై
ప్రొద్దును రేవెలుఁగును నేత్రములై -పొలయఁ గనుంగొనియెడు దేవునకై
సిద్ధము లగుపెద్దలపే రెఱుకల - నెలకొనియెడు నిశ్చలభావునకై.

ఉత్కళిక.

కడుదీనతతో మదితాపసికై
వడి నింటికిఁ జని వెదకప్పెరకై
కొని యాలుమగలఁ బెనురచ్చలకై
చనుదెందని నిక్కము సేయుటకై
వెనుద్రిప్పిన గుండములోపలఁ గై
కొని చని తన యెప్పటిరూపముకై
కొని గుండయ మెచ్చినవేల్పునకై
వినత పితామహఫణి తల్పునకై.

కళిక - తొలిపాదము - దిగంబరుఁడని చెప్పుటకు మాఱుగ కవి యిట్లు చమత్కరించినాఁడు.

రెండవపాదము - బాణునికి లింగావసరకాలమున నీశ్వరుడు వాకిటి కాఁపులవాఁడుగా నున్న కథ బసవపురాణము 4-వ ఆశ్వాసమునగలదు. (132-పుట)

ఉత్కళికయందు గుండయ్యచరిత్రము సూచింపఁబడినది.

బసవపురాణము - 4ఆ - 139-పుట.

గుండయ్యయను భక్తుఁ డొకనాడు తిరునీలకంఠదేవునిగుడి నుండి వచ్చుచున్నప్పుడు దారిలో నాతనిపై, మేడపైనుండి

తెలియక యొకవెలఁది, యెంగిలినీరుచల్లెను. ఆమెయు తనతప్పి దము తెలిసికొని, తత్క్షణము క్రిందికివచ్చి, యెంగిలినీరు పడిన యా భక్తుని తోడ్కొనిపోయి, యభ్యంజనాదిక్రియల నొనరించి తన్ను క్షమింపుమని గోరెను. గుండయయు నామెను వీడి యింటికివచ్చిన తోడనే గుండయభార్య, యీతని వైఖరిని గనిపెట్టి సానియింటినుండి వచ్చితివని యాతనిపై కోపించి, తన్నుముట్టిన తిరునీలకంఠ దేవరయానయని యొట్టుపెట్టెను. దంపతులీ నియమముతో నెనుబదియేండ్లుండిరి. ముదుసలులైరి. అంతట నీశ్వరుఁడు భక్తునివేషముదాల్చి, వీరికడకువచ్చి వీరి కొక కప్పెరనిచ్చి దాచుఁడనియు, తానుకోరినపుడీయ వలయు నని చెప్పి వెడలిపోయెను. శివుడువెడలిపోయి, కప్పెర నదృశ్యముచేసి, తిరిగివచ్చి దాని నిమ్మనికోరెను. గుండయ్యయు భార్యయు వడవడవడఁకుచు తమకేమి తెలియదనిచెప్పిరి ఈశ్వరుఁడు వారల నచ్చుటకుదగ్గఱగనున్న గుండములోనుఱికి తెలియ దని శపథము చేయగోరెను. వారట్లు గుండమున దుముకగానే, వారిరువురు నవయౌవనులైరి. ఈశ్వరుఁడు ప్రత్యక్షమై వారి నెనుబదేండ్లవఱకు నిట్లే యౌవనవంతులుగ నిలిపి, వెనుక ప్రమథగణమునఁ జేర్చుకొనెను.

## పంచమీవిభక్తి.

ఉ. పోయెదుఁ గాలమన్యగతిఁబొందదు, మోక్షము వెండికొండకుం
బోయెడుత్రోవ మీకెఱుఁగఁబోలదు మానవులార! రండు లేఁ
బ్రాయపుఁగొండ కందు శివభక్తులలోపల నద్రిరాజక
న్యాయుతపుణ్యమూర్తి వలనం గడతేరెదు జన్మఖేదముల్.

కళిక - జయభద్రరగడ జంపెతాళము.

మఱియుం సకలాశ్రితుల - మనుచునర్థమువలన
వఱలు పరమానంద-వనధి తీర్థమువలన
కొమరుమిఁగిలిన మంచు-గొండయల్లునివలన
విమతపురదహనకర - విష్ణుభల్లునివలన
శివభక్తహృదయసం-చితనిభానమునలన
వివిధరూపములలో - వెలయంజ్ఞానమువలన
అజ్ఞానఘనతమం - జడచుదీపమువలన
సుజ్ఞానులకును బోడ-సూపురూపమువలన.

ఉత్కళిక.

తనకినుకలోఁ బుట్టి
కనలి దక్షునిఁ గొట్టి
యదరి వేల్పులఁ బఱచి
తోడరి జన్నము చెఱచి
వీరభద్రుఁడు వచ్చి
చేరి మ్రొక్కిన మెచ్చి
యలరునిత్యునివలన
దళితదైత్యునివలన.

ఉత్కళికయందు దక్షాధ్వరధ్వంసము వర్ణితము

షష్ఠీవిభక్తి.

చ. కమలజుతోరపుంబునుకరకంచము, పాదసరోరుహార్చనా
కమలము వారిజోదరునికన్ను కరంబున కాదిభోగిభో

గము రవణంబు, చంద్రుఁడు శిఖాకుసుమంబటె, యెవ్వ
రీ డుమా
రమణునకుం గుమారగిరిరాజనివాసున కన్యదైవముల్.

కళిక-హాయప్రచారము లేక తురగవల్గనము రూపకతాళము.

మఱియుం మెఱయుం వేదవాద - మథనకథనసారమునకు
మెఱయుం దొట్టముట్టి ముట్టు - మేటిసీటితీరమునకు
బత్తు లుత్తు లొరసి యొరసి - పట్టు గట్టి తేజమునకు
సత్తుఁ జిత్తు దాన యైన - సత్యనిత్యబీజమునకు
వలచి కొలుచువారిఁ జేరి - వలపుదలఁపు దయ్యమునకు
నిలిచి నిలిచి చూడఁ జూడ - నిండియుండు తియ్యమునకు
మునులు ఘనులు బోధవీథి - ముట్టినట్టి తత్త్వమునకు
కనులుఁ గనులు నెఱుఁగనట్టి - పరమపదమహత్త్వమునకు.

ఉత్కలిక.

కదలి వదలి జూటకోటి
చదలఁ బొదల నేటినీటి
కడలఁ గడలఁ జెంది చెంది
జడల నొడలఁ బొంది పొంది
బాలలీలఁజూడఁజూడ
పోలి లీలఁ గ్రీడలాడ
నాదినాథజనకమునకు
[1]వాదపూరికనకమునకు.

---

1. వాతపురి - సంస్కృతము - (చిదంబరము-) రసవాదపుటూరని ద్రావిడోత్పత్తి.

కరికాల చక్రవర్తి కీశ్వరుఁడు పసిఁడివాన గురియించినాఁడు.

ఉత్కలికయం దీశ్వరునియష్టమూర్తిత్వము వర్ణితము - చూ. శాకుంతలము నాందీశ్లోకము - 'యాసృష్టిత్యాది'—

## సప్తమీవిభక్తి.

ఉ. వాచవిలోనుగా నొడలి వాకిళులం బొడచూపు తీపులం
ద్రోచి శివార్చనానియతితో వెలిచూడక చూడనేర్చినన్
లోచవిఁ బోలునే చవులు, లోకముచూడనిచూపులంగు మా
గాచలనాథునందుఁ ద్రిపురాంతకునందు గరంగు చిత్తమా!

కళిక - జయభద్రరగడ జంపెతాళము.

మఱియుఁ నుఁ గటాక్షజిత - మారునందు
తఱి త్రాడు సొమ్ముగను - దారునందు
బరులూను భక్తపశు - పాలునందు
కరుణాసుశీతకరి - కాలునందు
జగములు జనించు తొలి - జాడయందు
నిగమార్థముల్ నిలుచు - నీడయందుఁ
బొడ వెల్ల శాంతి యగు - పుణ్యునందు
గడలేక యొప్పు నర - గణ్యునందు.

ఉత్కళిక.

ఇలయుం సలిలంబు
వెలుఁగు ననిలంబు
దివియుం మిత్రుండుఁ
గువలయాప్తుండు
పరగుయజమాన
పరిపూర్ణుఁ డైన
యష్టతనునందు
శిష్టనుతునందు.

## సంబోధనము.

ఉ॥ శ్రీచనుదోయిపై శరముఁ జేర్చి, భుజంగమురాజసజ్య హే
మాచల మెక్కడించి నిగమావళి యట్టులువీడ్చి, పద్మజుం
జూచి మొగంబు లిచ్చిదివిజుల్ గొనియాడఁగనున్న నీ రణాం
తాచరణంబు విందుఁ జెపుమలారఁ గుమారగిరీంద్రమందిరా!

### కళిక - జయభద్రరగడ.

మఱియుం నానామంత్ర - మణిగణసుధాకల్ప!
కోఱలు నేనుఁగుమోము - కొడుకుఁ గాంచినవేల్ప!
మూఁడుమోములపోటు - ముట్టుఁ బట్టెడుశూర!
వేఁడిచూపునఁ దియ్య - విలుతుఁ ద్రుంచినధీర!
తాపసుల యీలువులఁ - దనరు తపములపంట!
చూపులకు నెల్లఁ బర - సుఖవార్ధిపెన్నింట!
తిలకాయమానదీ-ధితిసుధాసంసూతి!
వెలుఁగులకు నెల్లఁ దుది - వెలుఁ గగుపరంజ్యోతి!

### ఉత్కళిక.

వినుతముఖనలినమును
ఘనజఘనపులినమును
వరవళితరంగములు
గురుకుచరథాంగములుఁ
గలిగినయుమాసరసి
లలితముఖములఁ బెరసి
క్రాలు నొకకలహంస!
బాలచంద్రోత్తంస!

## సార్వవిభక్తికము.

శా. నీవాద్యుండవు ... ప్రథమావిభక్తి
నిన్నుఁ దెల్పఁ జదువుల్ ... ద్వితీయావిభక్తి
నీచేత మేలొందర ... తృతీయావిభక్తి
నీకై వాక్పూజ లొనర్తు ... చతుర్థీవిభక్తి
నీవలన బ్రహ్మాండావళుల్ పుట్టు ... పంచమీవిభక్తి
నీ కేవేల్పుల్ సరి, యన్యదైవభజనం బే నొల్ల - షష్ఠీవిభక్తి
నీయందు మద్భావం బందఁదగుం సప్తమీవిభక్తి
గుహూరగిరినాథా ! చంద్రచూడామణీ !- సంబోధనము.

---

Sri Rama Press, Madras. P. I. Card Q. H. No. Ms. 469—19-12-46.